ఆంధ్రజ్యోతి
****
ANDHRAJYOTHY
నల్లగొండ
5
ఆదివారం 27 ఏప్రిల్ 2025

హెల్ప్‌లైన్ నంబర్లు

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980

నల్లగొండ	:18004251442
యాదాద్రి	:1800 425 7106
సూర్యాపేట	:1800 425 1972

చికెన్ ధరలు

గుడ్డు డజన్ ధర : 66

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.162	240	270
సూర్యాపేట	రూ.165	220	250
నల్లగొండ	రూ.155	215	240

ఉష్ణోగ్రత గరిష్ఠం 41.0 | కనిష్ఠం 25.4



హన్మకొండ జిల్లాలో బీఆర్ఎస్ రజతోత్సవ సభా వేదిక

రజతోత్సవానికి గులాబీ దళం

- ఉమ్మడి జిల్లా నుంచి లక్ష మందిని తరలించేందుకు ఏర్పాట్లు
- వాహనాలను సిద్ధం చేసిన పార్టీ నేతలు
- మాజీ మంత్రి జగదీష్ రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాట్లు
- జనసమీకరణకు రంగంలోకి దిగిన మాజీ ఎమ్మెల్యేలు
- సభ ద్వారా పార్టీ భవిష్యత్ కార్యాచరణ వెల్లడిస్తారని అంచనా

బీఆర్ఎస్ రజతోత్సవ సభకు పార్టీ శ్రేణులు సిద్ధమయ్యాయి. హన్మకొండ జిల్లా ఎల్కతుర్తి లో ఆదివారం జరిగే ఈ సభకు ఉమ్మడి నల్లగొండ జిల్లా నుంచి లక్ష మంది వరకు తరలివెళ్లేందుకు పార్టీ నేతలు ఏర్పాట్లు చేశారు. సభ అనంతరం పార్టీ సంస్థాగత పదవులు భర్తీచేసే అవకాశం ఉండటంతో ఆ శావహులంతా పెద్ద సంఖ్యలో జనసమీకరణ చేస్తున్నారు.
- (ఆంధ్రజ్యోతి ప్రతినిధి, నల్లగొండ)

రజతోత్సవ సభను విజయవంతం చేసేందుకు మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్‌రెడ్డి నే తృత్వంలో మాజీ ఎంపీలు, మాజీ ఎమ్మెల్యేలు, పార్టీ నేతలంతా ఇప్పటికే గ్రామస్థాయి మొదలు నియోజకవర్గ స్థాయి వరకు సన్నాహక సమావేశాలు పూర్తిచేశారు. రజతోత్సవసభ పూర్తయ్యాక పార్టీని గ్రామస్థాయి నుంచి జిల్లా స్థాయి, రాష్ట్ర కార్యవర్గంవరకు సంస్థాగతంగా కమిటీలు ఏర్పాటు చేయాలని ఇప్పటికే నిర్ణయించారు. దీంతో ఈ సభను విజయవంతం చేయడం ద్వారా పార్టీలో తమ స్థానాన్ని పదిలపరచుకోవాలని, అధిష్ఠానం దృష్టి లో పడడం ద్వారా పార్టీ పదవు లు దక్కించుకోవాలని క్యాడర్ సన్నద్ధమవుతోంది.ఆదివారం ఉదయం నుంచే రజతోత్సవ సభకు వెళ్లేందుకు వీలుగా ఇప్పటికే వాహనాలను బుక్ చేసుకోగా, శనివారం మధ్యా హ్నం నుంచే ఉమ్మడి జిల్లాలో బీఆర్ఎస్ రజతోత్సవ సందడి మొదలైంది.

ఉమ్మడి జిల్లా నుంచి లక్ష మంది..

బీఆర్ఎస్ రజతోత్సవ సభకు ఉమ్మడి నల్లగొండ జిల్లా నుంచి సుమారు లక్షమంది తరలివెళ్లేలా పార్టీనేతలు సన్నాహాలు చేశారు. ప్రధానంగా సూర్యాపేట, తుంగతుర్తి, ఆలేరు, భువనగిరి నియోజకవర్గాల నుంచి 50వేల మంది వెళ్లేలా ఏర్పాట్లు చేయగా, మిగిలిన నియోజకవర్గాల నుం చి మరో 50వేల మంది సభకు వెళ్లేందుకు వీలుగా వాహనాలు ఏర్పాటు చేస్తున్నారు. ఆర్టీసీ బస్సులు, ప్రైవేట్ బస్సులతో పాటు కార్లను ఇప్పటికే అందుకు బుకింగ్ చేశా రు. ఉదయాన్నే బయలుదేరి వెళ్లేలా, మార్గమధ్యలోనే మ ధ్యాహ్న భోజనాలు చేసేలా ఏర్పాట్లు చేసినట్లు పార్టీ నా యకులు తెలిపారు. ప్రధానంగా యువత, మహిళలు పెద్దసంఖ్యలో సభకు వెళ్లేందుకు ఆసక్తి చూపుతున్నారని బీఆర్ఎస్ నేతలు చెబుతున్నారు. మాజీ మంత్రి జగదీష్‌రెడ్డితో పాటు మాజీ ఎంపీ, మాజీ ఎమ్మెల్యేలు నియోజకవర్గాల వారీగా సభకు వెళ్లే ఏర్పాట్లను పరిశీలిస్తున్నారు. ప్ర ధానంగా రవాణాపరంగా ఇబ్బందులు లేకుండా చూడాల ని, ముందుగా నిర్ణయించుకున్న మార్గాల్లోనే వాహనాలు వెళ్లాలని ఇన్‌చార్జీలకు స్పష్టంగా సమాచారం ఇచ్చారు.

గుర్తింపునకు అవకాశంగా భావిస్తున్న క్యాడర్

పార్టీ ఏర్పాటై 25 ఏళ్లు పూర్తవుతున్న సందర్భంగా ఏర్పాటు చేస్తున్న రజతోత్సవ సభను విజయవంతం చేయడంలో తమ కృషిని చాటుకోవడం ద్వారా పార్టీ అధిష్ఠానం దృష్టిలో పడేలా నాయకులు పనిచేస్తున్నారు. సభ కు వాహనాలు, జనసమీకరణ బాధ్యతలను...

- మిగతా 7వ పేజీలో...

జిల్లా నుంచి 40వేల మంది తరలింపు

బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు రవీంద్రకుమార్



దేవరకొండ, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): హన్మకొండలో ఈనెల 27న నిర్వహించనున్న బీఆర్ఎస్ రజతోత్సవ సభకు జిల్లా నుంచి 40వేల మందికిపైగా నాయకులు, కార్యకర్తలు హాజరుకానున్నట్లు బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ తెలిపారు. శనివారం దేవరకొండలో విలేకరులతో మాట్లాడుతూ, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ హాజరయ్యే రజతోత్సవ సభకు కనీవినీ ఎరగని రీతిలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు తరలివెళ్లనున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయలేదన్నారు. దీంతో ప్రభుత్వంపై వ్యతిరేకత మొదలైందన్నారు. ఎన్నికలు ఎప్పుడు వచ్చిన కేసీఆర్ నాయకత్వంలో బీఆర్ఎస్ విజయం సాధిస్తుందన్నారు. దేవరకొండ నియోజకవర్గం నుంచి వరంగల్ రజతోత్సవ సభకు 5వేల మందిని తరలిస్తున్నట్లు తెలిపారు.

పేదలు ఏళ్లుగా ఎదురుచూస్తున్న రేషన్‌కార్డుల మంజూరు ప్రక్రియను ప్రభుత్వం ప్రారంభించింది. అందులో భాగంగా ఆహారభద్రతా కార్డుల మంజూరు పత్రాలను జారీచేస్తోంది. ఆ తరువాత కార్డులను ముద్రించి ఇచ్చేందుకు సన్నాహాలు చేస్తోంది. యాదాద్రి జిల్లాలో 419 కుటుంబాలకు నూతన ఆహారభద్రతా కార్డుల మంజూరు పత్రాలను జారీ చేసింది. సూర్యాపేట జిల్లాలో సుమారు 1050 కిపైగా మంజూరు పత్రాలను జారీ చేసింది.
- (ఆంధ్రజ్యోతి,యాదాద్రి)



రేషన్ కార్డులు వస్తున్నాయ్!

- యాదాద్రి జిల్లాలో కొత్తగా 419 కుటుంబాలకు ఆహారభద్రతా కార్డుల మంజూరు పత్రాలు
- పేట జిల్లాలో 1050కి పైగా
- పదేళ్ల తరువాత మంజూరు
- ఈ ప్రభుత్వ హయాంలోనైనా కార్డులు ముద్రించి ఇచ్చేనా?

ఉమ్మడి రాష్ట్రంలో స్థానికత గుర్తింపుతో పాటు పలు ధ్రువీకరణ పత్రాలను రేషన్‌కార్డు ఆధారంగా జారీచేసేవారు. ప్రస్తుతం ఆధార్‌కార్డు మాదిరిగానే ఉమ్మడి రాష్ట్రంలో జారీచేసిన తెల్ల రేషన్‌కార్డులు బహుళ ప్ర యోజనాలకు (మల్టీపర్పస్) ఉపయోగపడేవి. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఈ కార్డులు కేవలం నిత్యావసర సరుకుల పంపిణీకి మాత్రమే పరిమితమైంది. గత ప్రభుత్వం రేషన్‌కార్డులను రద్దు చేసి,వాటి స్థానంలో ఆహారభద్రతా కార్డులను పంపిణీ చేయాలని నిర్ణయించినా, అవి జారీ కాలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడగానే అర్హులకు రేషన్ కార్డులు పంపిణీ చేస్తామని హామీ ఇచ్చింది. అందులో భాగంగా ఆరు గ్యారెంటీలకు దరఖాస్తులు తీసుకునే సమయంలో ప్రజల నుంచి రేషన్‌కార్డుల కోసం దరఖాస్తులు కూడా తీసుకుంది. ఒక్క యాదాద్రి జిల్లాలో పలు పథకాల కింద 2లక్షలకుపైగా దరఖాస్తులు వచ్చాయి. అందులో రేషన్ కార్డుల కోసం సుమారు 25వేలకు పైగా దరఖాస్తులు ఉన్నాయి. అయితే వీటిని పరిశీలించి, గ్రామాల్లో అధికారులు విచారించిన తర్వాత అర్హులైన వారికి రేషన్‌కార్డులు జారీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు అధికారులు విచారణ చేపట్టి లబ్ధిదారుల జాబితాను రూపొందించి ప్రభుత్వానికి నివేదించారు. ప్రస్తుతం యాదాద్రి జిల్లాలో కొత్తగా 419 కుటుంబాల కు ఆహారభద్రతా కార్డులు మంజూరు పత్రాలు జారీ చేసింది. సూర్యాపేట జిల్లాలో 1050కి పైగా మంజూరయ్యాయి. అదేవిధంగా 10వేలకు పైగా దరఖాస్తులు గతంలో ఉన్న రేషన్‌కార్డుల్లో నూతన కుటుంబ సభ్యు ల పేర్ల నమోదుకు వచ్చాయి. వాటిని సైతం అధికారు లు విచారించి పేర్లు నమోదు చేస్తున్నారు. నూతన కార్డుదారులకు మే నెల నుంచి సన్న బియ్యం పంపిణీ చేసేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు.

యాదాద్రి జిల్లాలో 2,17,323 కార్డులు

ఉమ్మడి జిల్లాలో 2015 నుంచి ఈ- పాస్ విధానం ద్వారా బియ్యం పంపిణీ చేస్తున్నారు. కొవిడ్-19 సమయం నుంచి ఆహారభద్రతా కార్డుదారులకు ప్రతీ సభ్యుడి కి 6కిలోల చొప్పున ఉచితంగా బియ్యాన్ని పం పిణీ చేస్తున్నారు. యాదాద్రి జిల్లాలో మొత్తం 2,16,841 ఆహారభద్రతా కార్డులు ఉండగా, వీటి లో 13,734 అంత్యోదయ కార్డులు ఉన్నాయి. జిల్లా లో మొత్తం 515 చౌకధరల దుకాణాలు ఉన్నాయి..

- మిగతా 7వ పేజీలో...

పదేళ్ల తరువాత...

ప్రభుత్వం ఆహారభద్రతా కార్డుల కింద కుటుంబంలోని మూడేళ్ల వయసు దాటిన వారందరికీ ఆరుకిలలో చొప్పున ఉచితంగా బియ్యాన్ని పంపిణీ చేస్తోంది. గత ప్రభుత్వం ఆహారభద్రత కార్డులుగా పేరు మార్చినప్పటికీ, ఇప్పటివరకు ఎలాంటి కార్డులు లబ్ధిదారులకు పంపిణీ చేయలేదు. త్వరలోనే కొత్త కార్డులను పంపిణీ చేస్తామని గత ప్రభుత్వం ప్రకటించినా, 2,16,904 రేషన్‌కార్డుదారులు ఇప్పటివరకు కాగితాలను జీరాక్స్ చేయించుకుని బియ్యం, ఇతర సరుకులు తీసుకుంటున్నారు. గత సర్కారు కార్డు జారీ ప్రక్రియను వాయిదాలతోనే సరిపెట్టింది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ఈ ప్రభుత్వంలోనైనా కార్డులు ముద్రిస్తారని లబ్ధిదారులు ఆశిస్తున్నారు. ప్రభుత్వం ప్రతినెలా లబ్ధిదారులకు బియ్యం అందిస్తున్నప్పటికీ, కార్డుల జారీలో జాప్యం జరుగుతోంది. గతంలో డిజిటల్ కార్డులను పంపిణీ చేయాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. అయితే కార్డుల జారీపై ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. ఈ ప్రభుత్వంలోనైనా కొత్తగా ఆహారభద్రతా కార్డులు అందుతాయనే ఆశతో ప్రజలు ఉన్నారు.

మిస్‌వరల్డ్ పోటీదారులకు

అసౌకర్యాలు కలగకుండా చూడాలి

రాష్ట్ర ఆర్ట్స్ గ్యాలరీ డైరెక్టర్, ఐఏఎస్ అధికారి లక్ష్మి



బుద్ధవనం వద్ద కలెక్టర్‌తో మాట్లాడుతున్న రాష్ట్ర ఆర్ట్స్ గ్యాలరీ డైరెక్టర్ లక్ష్మి

నాగార్జునసాగర్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): మిస్‌వరల్డ్ పోటీదారులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా చూడాలని రాష్ట్ర ఆర్ట్స్ గ్యాలరీ డైరెక్టర్, ఐఏఎస్ అధికారి లక్ష్మి అన్నారు. శనివారం కలెక్టర్ ఇలా త్రిపాఠి, మిర్యాలగూడ సబ్ కలెక్టర్ అమిత్‌నారాయణతో కలిసి బుద్ధవనం, విజయవిహార్‌ను ఆమె పరిశీలించారు. బుద్ధవనం సమావేశ మందిరంలో అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆమె మాట్లాడారు. హైదరాబాద్‌లో మే 7 నుంచి 31వ తేదీ వరకు మిస్‌వరల్డ్ పోటీలకు హాజరవుతున్న అతిథులు మే 12న బుద్ధ పూర్ణిమ సందర్భంగా సాగర్‌కు వస్తున్నారన్నారు. 15 రోజుల సమయం మాత్రమే మిగిలి ఉన్నందున త్వరితగతిన పనులు పూర్తిచేయాలని ఆదేశించారు. సివిల్ పనులను మే 3వ తేదీ నాటికి పూర్తిచేయలన్నారు. బుద్ధవనం, విజయవిహార్ పరిసరాల్లో రోడ్డుకు ఇరువైపులా లైటింగ్ ఏర్పాటుచేయాలని, పారిశుధ్య పనులు నిర్వహించాలని సూచించారు. కలెక్టర్ ఇలా త్రిపాఠి మిస్‌వరల్డ్ పోటీదారులు మే 12వ మధ్యాహ్నం 1గంటకు హైదరాబాద్ నుంచి బయల్దేరి సాయంత్రం 4.30కు సాగర్ విజయవిహార్‌కు చేరుకుంటారన్నారు. ఇక్కడ వారు సేదతీరి సాయంత్రం బుద్ధవనాన్ని సందర్శిస్తారని చెప్పారు. బుద్ధవనంలోని మహాస్తూపం లోపల ధ్యానం చేస్తారని, ఆతరువాత జాతకవనం, స్తూపవనం, చరితవనాలను తిలకించి తిరిగి రాత్రి 7.45 గంటలకు హైదరాబాద్‌కు బయల్దేరుతారని వివరించారు. సమావేశంలో సబ్‌కలెక్టర్ అమిత్‌నారాయణ, బుద్ధవనం ఓఎస్డీ సుధన్‌రెడ్డి, పర్యాటక శాఖ ఎస్ఈ భాస్కర్‌రావు, సాగర్ సీఐ శ్రీనునాయక్, తదితరులు పాల్గొన్నారు.

మహనీయుల ఆశయసాధనకు జనజాతర

కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగార్జున



సమావేశంలో మాట్లాడుతున్న పాలడుగు నాగార్జున

నల్లగొండ రూరల్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): మహనీయుల ఆశయ సాధనకు జనజాతర నిర్వహిస్తున్నట్లు కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి పాలడుగు నాగార్జున అన్నారు. స్థానిక దొడ్డికొమరయ్య భవనంలో శనివారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అంటరానితనం, కుల వివక్ష, సామాజిక దోపిడిపై అక్షర యుద్ధం చేసిన యోధులు జ్యోతిబాపూలే, అంబేడ్కర్ అని అన్నారు. వారి స్ఫూర్తితో ఆత్మ గౌరవం, సమానత్వం, కుల నిర్మూలనకు పోరాడాలని పిలుపునిచ్చారు. ఈనెల 28న సాయంత్రం 5గంటలకు నల్లగొండ గడియారం సెంటర్‌లో నిర్వహించే జనజాతరలో పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కళాకారుల సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. జనజాతరకు ఉస్మానియా యూనివర్సిటీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కాశీం, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి, ఏపూరి సోమన్న, స్కైలాబ్ బాబు, విద్యావంతుల అంబటి నాగయ్య, తదితరులు హాజరవుతారని తెలిపారు. సమావేశంలో కేవీపీఎస్ రాష్ట్ర కమిటీ సభ్యుడు బొట్టు శివకుమార్, జిల్లా ఉపాధ్యక్షుడు గాదె నరసింహ, సహాయ కార్యదర్శి బొల్లు రవీందర్‌కుమార్, జిల్లా కమిటీ సభ్యులు సైదులు, తదితరులు పాల్గొన్నారు.

భూముల పరిరక్షణకే 'భూభారతి' : కలెక్టర్

గుర్రంపోడు, పెద్దఅడిశర్లపల్లి, గుడిపల్లి, కనగల్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): భూముల పరిరక్షణకే భూభారతి చట్టాన్ని ప్రభుత్వం తీసుకువచ్చిందని కలెక్టర్ ఇలా త్రిపాఠి, నాగార్జునసాగర్ ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డి అన్నారు. శనివారం గుర్రంపోడు, పీఏపల్లి, గుడిపల్లి, కనగల్ మండల కేంద్రాల్లో ఏర్పాటుచేసిన భూభారతి అవగాహన సదస్సుల్లో కలెక్టర్ మాట్లాడారు. ధరణిలో దొర్లిన తప్పులను భూభారతి ద్వారా సరి చేసుకోవచ్చన్నారు. రికార్డుల సవరణతో పాటు, రికార్డుల నిర్వహణ, భద్రపరచడం, ఏటా రికార్డులను ప్రదర్శించే వెసులుబాటు భూభారతిలో ఉందన్నారు. రైతులు ఈ చట్టాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. మండల వ్యాప్తంగా ఉన్న వారసత్వ, వివిధ రకాల భూముల సమస్యలను త్వరలో పరిష్కరిస్తామన్నారు. అధికారులు భూముల సర్వేకు వచ్చినప్పుడు రైతులు అందుబాటులో ఉండి సమాచారం ఇవ్వాలన్నారు. ఇందిరమ్మ ఇళ్ల జాబితా పరిశీలన కోసం ప్రతీ 200 మంది లబ్ధిదారులకు ఒక గెజిటెడ్ అధికారిని నియమించామన్నారు. వారు పారదర్శకంగా విచారణ నిర్వహించి లబ్ధిదారులను ఎంపిక చేస్తారన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి అదనపు కలెక్టర్, మిర్యాలగూడ సబ్‌కలెక్టర్ నారాయణ్ అమిత్, దేవరకొండ ఏఎస్పీ మౌనిక, ఆర్డీవో రమణారెడ్డి, జిల్లా సహకార అధికారి పత్యానాయక్, తహసీల్దార్లు పరీదుద్దీన్, శ్రీనివాస్‌రావు, మధుహాసిని, పద్మ, ఎంపీడీవోలు మంజుల, నల్లగొండ ఏఎంసీ చైర్మన్ రమేష్, మాజీ చైర్మన్ బిక్షం, నర్సింగ్ శ్రీనివాస్‌గౌడ్, గడ్డం అనూప్‌రెడ్డి, చీదేటి వెంకట్‌రెడ్డి, రాజారెడ్డి, గోలి జగాల్‌రెడ్డి, నర్సింగ్ కృష్ణయ్యగౌడ్, హఫీజుద్దీన్, బోగరి రాంబాంబు, వెంకటేశ్వర్‌రావ్, పెంటయ్య, ఇతర అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



గుడిపల్లిలో అవగాహన సదస్సులో మాట్లాడుతున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

ధాన్యం దిగుమతులను వేగవంతం చేయాలి

(ఆంధ్రజ్యోతి, హాలియా): మిల్లర్లు ధాన్యం దిగుమతులను వేగవంతం చేయాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి సూచించారు. శనివారం సాయంత్రం నాగార్జునసాగర్‌కు వెళ్లి వస్తూ మార్గమధ్యలో ఉన్న అనుముల మండలం కొత్తపల్లిలోని బాలాజీ రైస్ ఇండస్ట్రీస్‌ను సబ్‌కలెక్టర్, ఇన్‌చార్జ్ అదనపు కలెక్టర్ అమిత్ నారాయణతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, వేగంగా ధాన్యం దిగుమతి చేసేందుకు అవసరమైన హమాలీలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. అదేవిధంగా మిల్లర్లు ధాన్యం దిగుమతులకు సంబంధించిన రిజిస్టర్లను నిర్వహించాలన్నారు. వెంటనే ట్రక్‌షీట్‌లను ఐకేపీ, పీఏసీఎస్‌కు అందజేయాలన్నారు. రైతులు కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకొని ప్రభుత్వం అందిస్తున్న మద్దతు ధర పొందాలన్నారు. ఆమె వెంట డీసీఎస్‌వో వెంకటేష్, డీఎం హరీష్, జిల్లా మిల్లర్స్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు చిట్టిపోలు యాదగిరి, బాలాజీ రైస్ ఇండస్ట్రీస్ మేనేజింగ్ పార్టనర్ చిట్టిపోలు కరుణాసాగర్, ప్రసాద్, పవన్, ఉన్నారు.

అభివృద్ధిలో పాల్గొంటున్న కాంట్రాక్టర్లను రక్షించాలి

బిల్డర్స్ అసోసియేషన్ జాతీయ ఉపాధ్యక్షుడు డీవీఎన్.రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న బిల్డర్స్ అసోసియేషన్ జాతీయ ఉపాధ్యక్షుడు డీవీఎన్.రెడ్డి

నల్లగొండ టౌన్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ అభివృద్ధిలో పాల్గొంటున్న కాంట్రాక్టర్లను రక్షించాలని బిల్డర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా జాతీయ ఉపాధ్యక్షుడు డీవీఎన్.రెడ్డి అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన బిల్డర్స్ అసోసియేషన్ జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం కాంట్రాక్టర్ల సమస్యలపై చర్చించాలని, బిల్లులు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఉమ్మడి జిల్లాకు చెందిన మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి జిల్లా అభివృద్ధికి పనులు నిర్వహిస్తున్న కాంట్రాక్టర్లను రక్షించాలన్నారు. ఆర్‌అండ్‌బీకి రూ.100కోట్లు ఇస్తే 200 బిల్లులు క్లియర్ అవుతాయన్నారు. రోడ్ల మరమ్మతుల బిల్లుల రూ.5వేల నుంచి రూ.20లక్షల వరకు ఉన్నాయని, వాటిని వెంటనే ఇప్పించాలన్నారు. చిన్న కాంట్రాక్టర్లకు బిల్లు చెల్లించి తోడ్పాటు అందించాలన్నారు. కాంట్రాక్టర్లతో సమావేశం నిర్వహించి ఎంత డబ్బు చెల్లిస్తారో, ఏ పనులు నిర్వహించాలో చెబితే ప్రభుత్వానికి అండగా ఉంటారన్నారు. రాష్ట్రంలో కాంట్రాక్టర్లు ప్రత్యక్షంగా, పరోక్షంగా మూడు లక్షల మందికి ఉపాధి కల్పిస్తున్నారని, వారిని రక్షించుకోవాల్సిన అవసరం ప్రభుత్వానికి ఉందన్నారు. అనంతరం డీవీఎన్.రెడ్డిని జిల్లా సభ్యులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఫౌండర్ చైర్మన్ కృష్ణారావు, సీడీఐ చైర్మన్ భాస్కర్‌రెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, కోశాధికారి సంతోష్‌రెడ్డి, జిల్లా చైర్మన్ భాస్కర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు శ్రీనివాస రెడ్డి, కార్యదర్శి రంగారావు, సత్యనారాయణ, మెదక్ జిల్లా బాధ్యులు సత్యమయ్య, కోకాపేట వినయ్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

భక్తజనసంద్రం యాదగిరిక్షేత్రం

- స్వామివారిని దర్శించుకున్న 40వేల మందికిపైగా భక్తులు
- స్వామివారికి శాస్త్రోక్తంగా నిత్య పూజా కైంకర్యాలు • 6లో..



అనుమతి లేకుండా కాల్వ గేట్లు ఎత్తితే చర్యలు

నార్కట్‌పల్లి, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): బీ.వెల్లెంల ఉదయ సముద్రం ఎత్తిపోతల రిజర్వాయర్ కుడి, ఎడమ కాల్వల గేట్లను ఎవరైనా అనుమతి లేకుండా ఎత్తితే చట్టపర చర్యలు తీసుకుంటామని ప్రాజెక్టు డీఈఈ పిచ్చయ్య, ఏఈఈ నవీన్‌లు ఒక ప్రకటనలో హెచ్చరించారు. ప్రాజెక్టు రిజర్వాయర్ పూర్తిస్థాయి నీటి మట్టం 0.302 టీఎంసీలు కాగా, ప్రస్తుతం రిజర్వాయర్‌లో 0.212 టీఎంసీల నీరు నిల్వ ఉందని తెలిపారు. వేసవి దృష్ట్యా గ్రామాల్లో బోర్లు ఎండిపోకుండా ఉండేందుకు, భూగర్భ జలాలు పెంపొందించే ఉద్దేశంతో కాల్వలకు నీటి విడుదల నిలిపామన్నారు. ఎవరైనా అనుమతి లేకుండా రిజర్వాయర్ కాల్వల గేట్లు, డీపీల గేట్లు ఎత్తితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



బీ.వెల్లెంల ఎత్తిపోతల ఎడమకాల్వ గేటు

పదవీ విరమణ శుభాకాంక్షలు



మీ కుటుంబ సభ్యులలో, బంధుమిత్రులలో,
సహోద్యోగులలోఎవరైనా పదవీ విరమణ చేస్తున్నారా ?
అయితే వారికి తీపి గుర్తుగా ఆంధ్రజ్యోతి ద్వారా అందించండి
పదవీ విరమణ శుభాకాంక్షలు
ఆంధ్రజ్యోతి అందిస్తోంది
జిల్లా ప్రకటనలకు 25% తగ్గింపు
GST 5% అదనం
అద్దంకి బైపాస్ రోడ్, ఆర్జాలబావి, నల్లగొండ, సెల్ : 9985410384
నల్లగొండ : 99854 13656, 99854 13365
సూర్యాపేట : 97036 18713, కోదాడ : 80967 10822
దేవరకొండ, మిర్యాలగూడ, భువనగిరి, చౌటుప్పల్ : 99854 10384

సెలవుల్లో ఈత, ఆటలతో ఆహ్లాదంగా..

- ఉదయం నుంచి సాయంత్రం వరకు క్రికెట్ ఆడేవాళ్లం
- యాదగిరిగుట్ట ఆలయ ఈవో ఏపూరి భాస్కర్‌రావు

(ఆంధ్రజ్యోతి-యాదాద్రి)

నా బాల్యం



'బాల్యంలో వేసవి సెలవుల్లో సరదాగా, ఆనందంగా గడిపేవాళ్లం. మాది ఉమ్మడి ఖమ్మం జిల్లా నేలకొండపల్లి మండలం చెరువుమాధవరం. చిన్నతంలో ఒకరోజు మొత్తం ఆటలతోనే గడిచిపోయేది. ప్రతి నిత్యం ఉదయం వేళల్లో మా ఊళ్లో పెద్ద చెరువులో గడిపేవాళ్లం. అక్కడే మధ్యాహ్నం వరకు స్నేహితులతో కలిసి ఈత కొట్టేవాళ్లం. అటునుంచి క్రికెట్ ఆడేవాళ్లం. మామిడి తోటలు బాగా ఉంటాయి. తోటల్లోకి వెళ్లి మామిడికాయలు కోసుకుని, తోటల్లోనూ ఉంటూ సరదా గడిపేశాం. మా చిన్నతనంలో గ్రామాల్లో పౌరానిక, సాంఘిక, తదితర వీధి నాటకాలు వేసేవారు. ఈ నాటకాలు మాకెంతగానో ఆకట్టుకునేవి. స్నేహితులు, కుటుంబసభ్యులతో కలిసి ప్రతిరోజూ నాటకాలను వీక్షించేవాళ్లం. రాత్రయితే స్నేహితులమంతా కలిసి మిద్దెలపైన ముచ్చట్లతో నిద్రలోకి జారుకునేది. వ్యవసాయ పరంగా తోటల్లో ఆహ్లాదకరమైన వాతావరణం ఉండేది. చెట్ల చాటున ఆడుకుంటూ సరదా సెలవులను గడిపేసేవాళ్లం. ఈ రోజులే వేరు...చిన్నతనం ఓ మధుర జ్ఞాపకం.



ఆటాడుకుందాం..రా!

» క్రీడా శిక్షణ..ఆటలకు నిచ్చెన » ప్రతీ క్రీడాంశానికి నిపుణుల కేటాయింపు » నెల రోజుల పాటు శిక్షణ



మిర్యాలగూడలోని ఎన్నెస్పీ క్రీడాప్రాంగణంలోని బాక్సింగ్ హాల్‌లో శిక్షణకు హాజరైన విద్యార్థులు(ఫైల్)

వేసవి క్రీడా శిక్షణా శిబిరాలకు సమయం ఆసన్నమైంది. రాష్ట్ర క్రీడా సాధికారత సంస్థ (స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ) ప్రతి ఏటా నిర్వహించే వేసవి శిబిరాలు ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 5 క్రీడాంశాల్లో జరుగనున్నాయి. మే 1 నుంచి జూన్ 6 వరకు ప్రతి రోజూ ఉదయం 6 నుంచి 9 వరకు, సాయంత్రం 5 నుంచి 7 గంటల వరకు శిక్షణా శిబిరాలు కొనసాగుతాయి. పీడీ, పీఈటీ, సీనియర్ క్రీడాకారులను శిక్షణా శిబిరాల ఇన్‌చార్జిలుగా నియమించారు. వారి ఆధ్వర్యంలో శిక్షణ ఇవ్వనున్నారు. ఈ మేరకు శిబిర స్థలాల్లో ఏర్పాట్లు పూర్తిచేశారు. మైదానాలు చదును చేశారు. త్వరలో క్రీడా సామాగ్రి అందనుంది. ఒక్కో శిబిర నిర్వాహణకు గౌరవ భృతిగా రూ.5వేలను క్రీడా శాఖ అందిస్తోంది. అలాగే పలు ప్రైవేట్ సంస్థల ఆధ్వర్యంలోనూ పలు శిక్షణా శిబిరాలు కొనసాగనున్నాయి.

- (ఆంధ్రజ్యోతి-మిర్యాలగూడ/భువనగిరి టౌన్/నల్లగొండ స్పోర్ట్స్)

గ్రామీణ ప్రాంతాల్లోని బాల, బాలికల్లో క్రీడాస్ఫూర్తిని నింపేందుకు జిల్లా యువజన,క్రీడా అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో వేసవి క్రీడా శిక్షణా శిబిరాల ఏర్పాట్లు పూర్తయ్యాయి. మొత్తం ఏడు క్రీడాంశాల్లో బాల, బాలికల ఆసక్తిని గుర్తించి క్రీడాంశాన్ని కేటాయిస్తారు. శిబిరంలో క్రీడాంశం ప్రాధాన్యాన్ని బట్టి బాల, బాలికలకు క్రీడా సామగ్రిని అందజేస్తారు. శిక్షణ శిబిరం ముగింపు రోజున బాల, బాలికలకు ప్రోత్సాహక సర్టిఫికెట్‌ను అందజేస్తారు. నెల రోజుల పాటు నిర్వహించే శిక్షణకు ఆ ప్రాంతంలోని ఎవరైనా దాతలు ముందుకు వస్తే సహకారాన్ని తీసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. పట్టణ ప్రాంతాల్లో నిర్వహించే శిక్షణా శిబిరాలకు ఎలాంటి ప్రోత్సాహం ఉండదు. కేవలం బాలబాలికలకు ప్రశంసా పత్రాలు మాత్రమే అందజేస్తారు. నల్లగొండ జిల్లాలో క్రీడా శిబిరాల ఎంపిక జాబితాను డీవైఎస్‌ఏ శనివారం విడుదల చేశారు.

మిర్యాలగూడలో..

మిర్యాలగూడ పట్టణంలోని అమరవీరుల పార్కులో వివేకానంద ఇనిస్టిట్యూట్ ఆధ్వర్యంలో కరాటే మాస్టర్ రమేష్‌బాబు శిక్షణ ఇవ్వనున్నారు. ఫ్యాషన్ డిజైనర్ చెలమళ్ల సందీపారెడ్డి కళాకృతులు, టాయ్స్, వ్యర్థాలకు అర్థాలనిచ్చే ఉత్పత్తుల తయారీలో ప్రతీ సీజన్‌లో ఉచిత శిక్షణ అందిస్తున్నారు.

ఇండోర్ స్టేడియంలో బ్యాడ్మింటన్

మిర్యాలగూడ పట్టణంలోని ఇండోర్ స్టేడియంలో బ్యాడ్మింటన్ క్రీడలో నెల రోజుల పాటు శిక్షణ ఇవ్వనున్నారు. డీఎస్ఏ కోచ్ మారబోయిన రామకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించనున్న సమ్మర్ క్యాంప్‌లో ప్రవేశం పొందేందుకు ఆసక్తి ఉన్న విద్యార్థులు 9948052108 నెంబరును సంప్రదించాలి.

ఎన్నెస్పీ మైదానంలో బాక్సింగ్

మిర్యాలగూడ పట్టణంలోని ఎన్నెస్పీ క్రీడామైదానంలో వేసవి క్రీడాశిక్షణ శిబిరంలో భాగంగా బాక్సింగ్ క్రీడలో శిక్షణ ఇవ్వనున్నారు. జిల్లా క్రీడాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో మే 1న ప్రారంభమయ్యే శిక్షణ నెల రోజులు పాటు కొనసాగుతుందని డీఎస్ఏ కోచ్ రవీందర్‌గౌడ్ తెలిపారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు 9959196986 నెంబరుకు కాల్ చేసి పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

అమరవీరుల పార్కులో కరాటే

ఎన్నెస్పీ క్యాంపులోని అమరవీరుల పార్కు(స్తూపం)లో వివేకానంద ఇనిస్టిట్యూట్ ఆధ్వర్యంలో కరాటే ఉచిత శిక్షణ ఇవ్వనున్నారు. కరాటే మాస్టర్ చిలుకూరి రమేష్‌బాబు ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వేసవి శిబిరంలో ప్రవేశం పొందగోరు విద్యార్థులు 9347671555 నెంబరులో సంప్రదించి పేరు నమోదు చేసుకోవాల్సి ఉంటుంది.

యాదాద్రి భువనగిరి జిల్లాలో..

క్రీడాంశం	స్థలము	నిర్వాహకులు / సెల్ నెంబర్
ఖోఖో	వలిగొండ	ఆర్ మత్స్యగిరి / 8179976813
ఖోఖో	అనాజీపూర్	పి అంజయ్య/ 9948825255
ఖోఖో	మర్యాల	కె గోపాల్ / 9492504743
వాలీబాల్	వలిగొండ	సాయికుమార్/ 9505079059
వాలీబాల్	యాదగిరిగుట్ట	వినోద్‌కుమార్ / 9177888277
వాలీబాల్	నారాయణపూర్	సుక్క గిరిబాబు/ 9392966892
వాలీబాల్	ఆలేరు	జి మధుసూదన్/ 9000989671
అథ్లెటిక్స్	మర్యాల	జి సునీల్ / 8688318199
తైక్వాండో	నారాయణపూర్	భరత్‌కుమార్/9542410905
తైక్వాండో	జూలూరు	జి కృష్ణ / 9010238929

నల్లగొండ జిల్లాలో క్రీడా శిబిరాలు

క్రీడాంశం	స్థలము	నిర్వాహకులు
కబడ్డీ	కుర్మేడు	జేచ,ంద్రయ్య, పీడీ
హ్యాండ్‌బాల్	జడ్పీహెచ్ఎస్ మామిడాల	బీ.సురేందర్, పీడీ
వాలీబాల్	జడ్పీహెచ్ఎస్ కొప్పోలు	బీ రవి,పీఈటీ
ఖోఖో	జడ్పీహెచ్ఎస్ నెమ్మాని	వీ శ్రవణ్ కుమార్
హాకీ	జడ్పీహెచ్ఎస్ ఉరుమడ్ల	బి.రాము,పీఈటీ
జూడో	ఎల్లారెడ్డిగూడ కృష్ణవేణి హైస్కూల్	అంజనేయులు, పీఈటీ
బాల్ బ్యాడ్మింటన్	గట్టుప్పల్	పి.జంగయ్య, సీనియర్ ప్లేయర్
వాలీబాల్	జడ్పీహెచ్ఎస్ వెల్మకన్నె	కె.పరమేష్, పీడీ
హ్యాండ్‌బాల్	జడ్పీహెచ్ఎస్ చెర్వుఅన్నారం	సీహెచ్.పుల్లయ్య
కబడ్డీ	జడ్పీహెచ్ఎస్ హాలియా	సీహెచ్.ఎల్లయ్య, పీఈటీ

డీవైఎస్‌ఏ శిబిరాలను సమర్థంగా నిర్వహించాలి



డీవైఎస్‌ఏ వేసవి శిక్షణా శిబిరాలను ఎంపిక చేసిన ప్రాంతాల్లో నిర్వాహకులు సమర్థంగా నిర్వహించాలి. వేసవి సెలవులు కావటంతో బాల, బాలికలు ఆసక్తి ఉన్న క్రీడాంశాల్లో నైపుణ్యాలను మెరుగు పర్చుకునేందుకు శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి. 30 రోజుల పాటు 10 వేర్వే రు ప్రాంతాల్లో వేర్వేరు క్రీడాంశాల్లో ఉచితంగా శిక్షణ ఇస్తారు. శిబిరాలకు వచ్చి తర్ఫీ దు పొందేందుకు కావాల్సిన క్రీడా పరికరాలు అందజేస్తున్నాం. ముగింపు రోజున ప్రశంసాపత్రాలు కూడా అందజేస్తాం. ఆటల్లో రాణిస్తే భవిష్యత్ ఉంటుంది. తమ పిల్లల ఆసక్తిని బట్టి తల్లిదండ్రులు ఆటలను నేర్పించేందుకు ప్రోత్సహించాలి.

- కుంభ నర్సిరెడ్డి, డీవై ఎస్‌వో, నల్లగొండ జిల్లా

శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి ..



వేసవి క్రీడా శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి. ఆసక్తిగల విద్యార్థులు, యువత ఆయా శిబిరాలకు క్రమం తప్పకుండా వెళ్లాలి. శిబిరాలతో క్రీడా నైపుణ్యం పెరుగుతుంది. పోటీలలో పథకాలు గెలిచే అవకాశాలు మెరుగు పడతాయి. శిక్షణ చివరి రోజున సర్టిఫికెట్లు అందజేస్తాము. వివరాల కోసం సెల్ నెంబర్లకు సంప్రదించవచ్చును. శిబిరాలకు హాజరయ్యే క్రీడాకారులకు పౌష్టికాహారం ఇచ్చేందుకు దాతలు సహకరించాలి.

- కే ధనాంజనేయులు,యాదాద్రిభువనగిరి జిల్లా క్రీడల,యువజన శాఖ అధికారి

వేసవిలో శాకాహారంతోనే

ఆరోగ్యం

» కాయగూరల్లోనే ఎన్నో పోషకాలు
» చలువ చేసే ఆహారం భుజించాలి
» వేపుళ్లకు స్వస్తి పలకాలి



రోజురోజుకూ ఎండల తీవ్రత పెరుగుతోంది. 45 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. మండుటెండలకు అందరూ హడలెత్తిపోతున్నారు. భానుడి ప్రతాపానికి కాలు బయట పెట్టాలంటేనే భయంతో వణికిపోతున్నారు. ఎండల దెబ్బకు ఇంట్లో ఉన్నా సరే నీరసంతో అనారోగ్యానికి గురయ్యే ప్రమాదం ఉంది. వేసవిలో ఆరోగ్యాన్ని కాపాడుకునేందుకు పలు జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం కూడా ఎంతైనా ఉంది. ముఖ్యంగా ఆహారం విషయంలో తగిన జాగ్రత్తలు పాటించాలి. ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్నా అనారోగ్యానికి గురి కావాల్సి వస్తుంది. అందుకే వేసవికాలంలో వీలైనంత వరకు తాజా కూరగాయలతో చేసిన వంటలను ఆరగిస్తేనే మంచిది.

- (ఆంధ్రజ్యోతి - నిడమనూరు)

వేసవికాలంలో ఆహార అలవాట్లలో కొన్ని మార్పులు చేసుకోవడం మంచిది. వేపుళ్లకు దూరంగా ఉండటంతో పాటు మాంసాహారాన్ని తగ్గిస్తే మంచిది. వేసవిలో ఒంటికి వేడి చేసే ఆహార పదార్థాలు కాకుండా చలువ చేసే ఆహారం భుజించడం అన్నివిధాలా ఎంతో మేలు. శాకాహారమే అన్నివిధాలుగా మేలు చేస్తుందని వైద్యులు చెబుతున్నారు. కాయగూరల్లో ఎన్నో విలువైన పోషకాలు ఉంటాయి. విటమిన్లతో కూడిన ఆహారం ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది. మినరల్స్, విటమిన్స్, కార్బోహైడ్రేట్స్ అన్నీ ఉన్న సంతులిత పోషకాహారం దివ్య ఔషధంగా ఒంటికి పనిచేస్తుంది. ఏ విటమిన్ కోసం క్యారెట్, బీ విటమిన్ కోసం సోయాబీన్స్, సీ విటమిన్ కోసం టమాట, డీ విటమిన్ కోసం వెన్న, ఈ విటమిన్ కోసం ఆకుపచ్చని కూరగాయలు, కే విటమిన్ కోసం బంగాళాదుంపలు తీసుకోవడం మంచిది. టమాట, వంకాయ, దోసకాయ, బీర, బెండ, దొండ, మునగ వంటి తదితర కూరగాయల్లో ఎన్నో విలువైన పోషకాలు ఉంటాయి.

రోగ నిరోధక శక్తిని పెంచే టమాట..

ఒంట్లో రోగనిరోధక శక్తిని పెంచే గుణం టమాటాలకు ఉంది. శరీరంలోని విష పదార్థాలను టమాట తొలగిస్తుంది. చక్కెర వ్యాధితో బాధపడేవారికి టమాటాలు మేలు చేస్తాయి. టమాటాలతో స్థూలకాయం కూడా తగ్గుతుంది. ఊపిరితిత్తులకు సంబంధించిన అనారోగ్యాన్ని తగ్గిస్తాయి. వీటి రసం తాగితే శరీర కాంతి కూడా పెరుగుతుంది.

కొలెస్ట్రాల్‌ను తగ్గించే వంకాయలు..

కొలెస్ట్రాల్‌తో బాధపడేవారికి వంకాయలు ఎంతో మేలు చేస్తాయి. ఇవి తినడం వల్ల శరీరానికి పోషకపదార్థాలు అందుతాయి.యాంటీ డయాబెటిక్‌గా కూడా పనిచేస్తాయి. వంకాయలను ఎంతో ఇష్టంగా భుజిస్తారు.

క్యారెట్ తింటే కామెర్లు మాయం

రోజూ ఓ క్యారెట్ తినడం ఆరోగ్యానికి ఎంతో మంచిది. క్యారెట్‌లో సోడియం, క్లోరిన్, ఐరన్‌తో పాటు విటమిన్లు పుష్కలంగా ఉంటాయి. అతిసార నయమవుతుంది. కామెర్లు కూడా తగ్గుతాయి. క్యారెట్ జ్యూస్ తాగితే మలబద్ధకం తొలగుతుంది. కంటిచూపునకు కూడా మేలు చేస్తుంది. శరీరానికి నిగారింపునిస్తుంది.

బీట్‌రూట్‌తో ఎంతో మేలు

బీట్‌రూట్ రసంలో ఒక స్పూన్ నిమ్మ రసం కలుపుకొని తీసుకుంటే కామెర్లు, వాంతులు, వికారం, అతిసారం వంటి వ్యాధుల నుంచి ఉపశమనం పొందవచ్చు. శరీరంలో రక్త వృద్ధిని కూడా పెంచుతుంది. వేసవిలో ప్రతి రోజూ బీట్‌రూట్ రసం తాగితే ఆరోగ్యానికి ఎంతో మంచిది.

దోసకాయ..

దోసకాయతో కూడిన ఆహారం ఒంటికి చలువ చేయడమే కాకుండా జీర్ణక్రియకు సంబంధించిన వ్యాధులను నివారిస్తుంది. కడుపునొప్పి, పొట్ట ఉబ్బరం లాంటి తదితర వ్యాధులను సైతం దూరం చేస్తుంది.

షుగర్ వ్యాధిగ్రస్తులకు కాకర ఔషధం

అతిసార ప్రభావాన్ని తగ్గిస్తాయి. దీని రసం వల్ల కలరా లాంటి వ్యాధులు దరి చేరవు. కాకరకాయలు తింటే చక్కెర శాతం తగ్గుతుంది. రోగ నిరోధక శక్తిని పెంచుతాయి.

ఇవే కాకుండా ఇతర కూరగాయలు సైతం శరీరానికి కావాల్సిన ఎన్నో పోషక విలువలు కలిగిన ఆహారాన్ని అందిస్తాయి. వేసవిలో ఆరోగ్యంగా ఉండాలంటే శాకాహారం తీసుకోవడం ఎంతో మేలంటున్నారు వైద్యులు.

భారత్ సమ్మిట్‌లో రాజగోపాల్‌రెడ్డి



భారత్ సమ్మిట్‌లో మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, ఆయన పక్కన ఎమ్మెల్సీలు విజయశాంతి, దయాకర్

చౌటుప్పల్ టౌన్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లోని నోవాటెల్‌లో శనివారం నిర్వహించిన భారత్ సమ్మిట్‌లో మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. సమ్మిట్‌కు విచ్చేసిన కాంగ్రెస్ అగ్రనేతలతో పాటు విదేశీ ప్రతినిధులతో రాజగోపాల్‌రెడ్డి పిచ్చాపాటిగా మాట్లాడుతూ అందరి దృష్టిని ఆకర్శించారు. అదేవరసలో ఎమ్మెల్సీలు విజయశాంతి, అద్దంకి దయాకర్‌లు ఉన్నారు.

ఎక్కడికక్కడే ఉపాధ్యాయుల సమస్యలు



ప్రసంగిస్తున్న చావా రవి

నల్లగొండ టౌన్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కాకుండా ఎక్కడికక్కడే ఉన్నాయని, ఇప్పటికే ఐదు డీఏలు, పీఆర్సీలు పెండింగ్‌లో ఉన్నాయని టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు చావా రవి అన్నారు. శనివారం జిల్లాకేంద్రంలో నిర్వహించిన ఉద్యమ తరగతులకు హాజరై, మాట్లాడారు. పెండింగ్ బిల్లులు రెండేళ్ల నుంచి ఈ కుబేర్‌లో జమ కావడం లేదని, వెంటనే విడుదల చేయాలన్నారు. శిక్షణా తరగతుల్లో ప్రభుత్వ విద్యారంగం, శాస్త్రీయ ఆలోచన, సంఘ నిర్మాణం- నిబంధనలు, సర్వీస్ లీవ్ రూల్స్ మీద చర్చిస్తామన్నారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల నమోదు పెంపునకు కృషి చేయాలని మాజీ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి అన్నారు. హక్కులు, బాధ్యతలు రెండు నేత్రాలుగా పనిచేస్తున్న టీఎస్‌యూటీఎఫ్ సంఘం ఉద్యమ తరగతుల్లో ప్రభుత్వ విద్యారంగాన్ని రక్షించడానికి ప్రణాళికలు రూపొందించాలన్నారు. ప్రభుత్వ విద్యారంగాన్ని కాపాడాలని అందుకోసం ప్రతి ఒక్కరూ కంకణబద్ధులై పనిచేయాలన్నారు. కార్యక్రమంలో టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శులు ఎం.రాజశేఖర్‌రెడ్డి, జీ నాగమణి, జిల్లా అధ్యక్షుడు బక్కా శ్రీనివాసాచారి, ప్రధానకార్యదర్శి పెరుమాళ్ల వెంకటేశం, ఉపాధ్యక్షుడు బీ అరుణ, నర్రా శేఖర్‌రెడ్డి, కోశాధికారి వడ్త్యా రాజు, రాష్ట్ర సాంస్కృతిక కన్వీనర్ నల్ల నరసింహ, రాష్ట్ర కమిటీ సభ్యులు ఎడ్ల సైదులు, సీహెచ్ అరుణ, జిల్లా కార్యదర్శులు రామలింగయ్య, శ్రీనివాస్‌రెడ్డి, నరసింహ, రమాదేవి, వెంకన్న, చిన వెంకన్న, సైదులు, మురళయ్య పాల్గొన్నారు.

మహిళలు హ్యాండ్‌బాల్ క్రీడల్లో రాణించాలి

నల్లగొండ స్పోర్ట్స్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : హ్యాండ్‌బాల్ క్రీడకు మంచి ఆదరణ ఉందని, మహిళా క్రీడాకారులు అందులో రాణించాలని డీవైఎస్‌ఏ కుంభం నర్సిరెడ్డి అన్నారు. ఉమ్మడి నల్లగొండ జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మేకల అభినవ్ స్టేడియంలో ఏర్పాటుచేసిన సీనియర్ మహిళల జిల్లా జట్ల ఎంపిక పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థినులు హ్యాండ్‌బాల్ రాష్ట్ర, జాతీయస్థాయి పోటీల్లో రాణిస్తే విద్యా, ఉద్యోగాల్లో రిజర్వేషన్ సౌకర్యం ఉంటుందన్నారు. అనంతరం నిర్వహించిన పోటీల్లో అత్యంత ప్రతిభ కనబర్చిన క్రీడాకారులను రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రధానకార్యదర్శి పుల్లయ్య, వ్యాయామ ఉపాధ్యాయులు కవిత, చైతన్యకుమార్, గుప్తా, మహేష్, నరేష్, బాబు, అంజీ, ఆస్మా తదితరులు పాల్గొన్నారు.

భక్తజనసంద్రం..యాదగిరిక్షేత్రం



ప్రాకారమండపంలో క్యూలైన్లలో భక్తులు

యాదగిరిగుట రూరల్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి సన్నిధి శనివారం భక్తజన సంద్రాన్ని తలపించింది. వేసవిసెలవులు ఉండటంతో భక్తులు అధికసంఖ్యలో ఇష్టదైవాన్ని దర్శించుకునేందుకు భారీ సంఖ్యలో తరలివచ్చారు. యాత్రాజనుల హరిహర నామస్మరణల నడుమ క్షేత్రమంతా ఆధ్యాత్మిక సందడి నెలకొంది. కొండకింద లక్ష్మీపుష్కరిణిలో పుణ్యస్నానాలు ఆచరించిన యాత్రికులు ఇష్టదైవాల దర్శనాల కోసం కొండపైకి చేరుకున్నారు. భక్తుల సంచారంతో కొండపైన ఆలయ తిరువీధులు, స్వామివారి ఉభయ దర్శనాల క్యూలైన్లు కిక్కిరిసిపోయాయి. స్వామి ధర్మదర్శనానికి 3గంటలు, ప్రత్యేక దర్శనానికి 2గంటల సమయం పట్టిందని, సుమారు 40వేల మందికి పైగా భక్తులు స్వామివారిని దర్శించుకున్నట్టు దేవస్థాన అధికారులు తెలిపారు. ఇదిలా ఉండగా, స్వామికి నిత్య పూజలు ఘనంగా కొనసాగాయి. వేకువజామున సుప్రభాతంతో నిత్యారాధనలు ఆరంభించిన ఆచార్యులు రాత్రి వేళ మహానివేదన, శయనోత్సవ పర్వాలతో ఆలయ ద్వారబంధనం చేశారు. గర్భాలయంలోని స్వయంభువులకు అభిషేకం, అర్చనలు, ప్రాకార మండపంలో హోమం, నిత్యతిరుకల్యాణోత్సవ పర్వాలు సంప్రదాయరీతిలో కొనసాగాయి. కొండపైన శివాలయంలో రామలింగేశ్వరుడికి నిత్య పూజలు, నిత్య రుద్ర హవనం, కొండకింద వ్రత మండపంలో సత్యనారాయణస్వామి వ్రతపూజలు శైవాగమ పద్ధతిలో కొనసాగాయి. కాగా, ఆలయ ఖజానాకు రూ.32,33,355 నిత్యాదాయం సమకూరింది.

హరినామ సంకీర్తనకు అవకాశం కల్పించాలి

యాదగిరిగుట్ట కొండపైన 1008 హరినామ సంకీర్తన, లక్ష్మీనరసింహస్వామి నామస్మరణ చేయడానికి భక్తులకు అవకాశం కల్పించాని అన్నమయ్య కళాక్షేత్రం పీఠాధిపతి విజయశంకర్‌స్వామి ప్రభుత్వాన్ని, గుట్ట దేవస్థానం అధికారులను కోరారు. ఇలాంటి అవకాశం తిరుమల తిరుపతి దేవస్థానంలో ఉందని గుర్తుచేశారు. శనివారం స్థానిక బస్టాండ్ నుంచి సింహద్వారం వరకు అన్నమయ్య కళాక్షేత్రం ఆధ్వర్యంలో శ్రీలక్ష్మీనృసింహస్వామి నామస్మరణతో శోభాయాత్ర నిర్వహించారు. కార్యక్రమంలో అన్నమయ్య కళాక్షేత్ర సమ్మేళనం యాదగిరిగుట్ట కన్వీనర్ శిఖ గణేష్, హిందూస్ ఫర్ ప్లూరాలిటీ అండ్ ఈక్వాలిటీ(హెచ్‌పీఎఫ్) అధికార ప్రతినిధి ఖదిజ్ఞాసి మల్లికావల్లభ, అన్నమయ్య కళాక్షేత్ర అధికార ప్రతినిధి బాల సుబ్రమణ్యం, లక్ష్మేశ్వర్‌దున్న, ఖదిజ్ఞాసి రాజు, ఎర్ర బాలయ్య, సిద్దులు, రచ్చ లక్ష్మి, మిర్యాల లక్ష్మి, రచ్చ హేమలత పాల్గొన్నారు.



కల్యాణోత్సవ తంతు నిర్వహిస్తున్న అర్చకులు

కోలాహలం నడుమ కల్యాణం

మఠంపల్లి, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : సూర్యాపేట జిల్లా మఠంపల్లి మండలం మట్టపల్లి శ్రీలక్ష్మీనృసింహస్వామి క్షేత్రంలో స్వామివారి నిత్యకల్యాణాన్ని శనివారం భక్తుల కోలాహలం నడుమ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో నిత్యపూజలు నిర్వహించారు. అనంతరం నిత్యకల్యాణాన్ని వైభవంగా జరిపించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు చెన్నూరి విజయ్‌కుమార్, మట్టపల్లిరావు, ఈవో నవీన్, ఆలయ అర్చకులు శ్రీనివాసాచార్యులు, పద్మనాభాచార్యులు, ఫణిభూషణమంగాచార్యులు పాల్గొన్నారు.

దైవచింతనతో జీవితం ధన్యం



శుభవార్త దేవాలయంలో ప్రత్యేక ప్రార్థనలకు హాజరైన భక్తులు

మఠంపల్లి, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : దైవ చింతనలో గడిపే వారి జీవితం ధన్యమని, వారికి ఎలాంటి సమస్యలు ఉన్నా తీరుతాయని శుభవార్త దేవాలయ విచారణ గురువు పసల మార్టిన్ అన్నారు. దక్షిణ తెలంగాణలోనే అతి పెద్ద చర్చిగా పేరుగాంచిన మఠంపల్లి శుభవార్త దేవాలయంలో రెండు రోజులుగా జరుగుతున్న వార్షిక వేడుకలు శనివారం పెద్దలపూజతో ముగిసాయి. ఉదయం 7గంటలకు క్రైస్తవ కుటుంబాలలో మరణించి వారి కోసం దివ్యబలిపూజ(పెద్దల పూజ)ను వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విచారణ గురువు మాట్లాడుతూ లోక రక్షణార్థమే ఏసు జననం అన్నారు. ప్రతి ఒక్కరూ సేవభావంతో పనిచేయాలని, తోటి వారికి సహాయం చేసే గుణాన్ని అలవర్చుకోవాలన్నారు.

రెండు రోజుల పాటు నిర్వహించిన ఉత్సవాలకు తెలుగు రాష్ట్రాల నుంచి పెద్దసంఖ్యలో భక్తులు, క్రైస్తవులు తరలివచ్చారు. కార్యక్రమంలో ఫాదర్లు సలిబండ్ల బాలశౌరి, బాల్‌రెడ్డి, కాకుమాను రాజు, అల్లంబాల, రాజేష్, సబాస్టిన్, చర్చి పెద్దలు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

అట్టహాసంగా ఎద్దులపందేలు ప్రారంభం



ఎద్దుల బండలాగుడు పోటీలను ప్రారంభిస్తున్న ఫాదర్

శుభవార్త దేవాలయ వార్షిక వేడుకల సందర్భంగా శుభోదయ యువజన సంఘం ఆధ్వర్యంలో తెలంగాణ- ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల స్థాయి ఎద్దుల బండలాగు బలప్రదర్శన పోటీలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ఈ పోటీలను దేవాలయ విచారణ గురువు మార్టిన్ పసల, మఠంపల్లి మాజీ సర్పంచ్ ఆదూరి కిషోర్‌రెడ్డిలు ప్రారంభించారు. మొదటిరోజు నాలుగు పండ్ల విభాగంలో 11 జతల ఎద్దులు పాల్గొన్నాయి. పెద్దఎత్తున ప్రేక్షకులు, అభిమానులు రాకతో వీవీ మైదానం కిటకిటలాడి పండుగ వాతవరణం నెలకొంది. కార్యక్రమంలో యువజన సంఘం అధ్యక్షుడు గాదె జయభారత్‌రెడ్డి, ఫాదర్ వినోద్‌రెడ్డి, ఆదూరి మధుసూదన్‌రెడ్డి, శౌరెడ్డి, జడ్డు జలబాల్‌రెడ్డి, కె.చిన్నపురెడ్డి, భాస్కర్‌రెడ్డి, బాలశౌరిరెడ్డి, గాదె పవన్‌రెడ్డి, కిరణ్‌కుమార్‌రెడ్డి, రంజిత్‌రెడ్డి, సిస్టర్ రూబీ, సుజాత, అలంబాల్‌రెడ్డి, అంతోన్‌రెడ్డి, లూర్ధురెడ్డి, చర్చిపెద్దలు, సంఘంసభ్యులు పాల్గొన్నారు.

రేషన్‌కార్డులు వస్తున్నాయ్!

(5వ పేజీ తరువాయి)

ప్రతినెలా 4216.320 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని సరఫరా చేస్తున్నారు. అంత్యోదయ కార్డుదారులకు 13.734 మెట్రిక్ టన్నుల చక్కెర పంపిణీచేస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం తాజాగా రేషన్‌కార్డు లబ్ధిదారులకు సన్న బియ్యం పంపిణీ చేస్తోంది. కొత్తగా మంజూరైన కార్డులతో కలిపి రేషన్‌కార్డుల సంఖ్య 2,17,323కు చేరింది. గతంలో రేషన్ దుకాణాల ద్వారా చక్కెర, గోధుమలు, కందిపప్పు, చింతపండు, కారంపొడి, పసుపు, ఉప్పు, గోధుమపిండి, కిరోసిన్ తదితర నిత్యావసర వస్తువులు పంపిణీచేసింది. ప్రస్తుతం ఇవన్నీ నిలిచిపోయాయి. కాంగ్రెస్ ప్రభుత్వం వీటి పంపిణీపై ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందోనని లబ్ధిదారులు ఎదురుచూస్తున్నారు.

మే నుంచి కొత్త లబ్ధిదారులకు సన్నబియ్యం

ప్రభుత్వం కొత్తగా రేషన్‌కార్డులు జారీచేయాలని నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు జిల్లా వ్యాప్తంగా వచ్చిన దరఖాస్తుల్లో 149 కుటుంబాలకు నూతనంగా కార్డు మంజూరీ పత్రాలు జారీచేశాం. మే నేల నుంచి కొత్తగా మంజూరైన ఆహారభద్రతా కార్డుదారులకు సన్న బియ్యం పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకున్నాం. ఈ మేరకు రేషన్ డీలర్ల వారీగా లబ్ధిదారుల జాబితాను రూపొందించి, స్థానిక తహసీల్దార్‌కు సమాచారం అందించాం. జిల్లాలో సన్న బియ్యం పంపిణీ పకడ్బందీగా చేపడతాం.

● జి.వీరారెడ్డి, అదనపు కలెక్టర్ రెవెన్యూ, యాదాద్రి

రజతోత్సవానికి గులాబీ దళం



(5వ పేజీ తరువాయి)

మాజీ ఎమ్మెల్యేలే చూస్తున్నా, వీలైనంత ఎక్కువ మందిని తరలించడంలో వారికి తోడ్పాటుగా ఉండేలా క్యాడర్ పనిచేస్తోంది. ఈ సభ ముగిశాక గ్రామస్థాయి నుంచి జిల్లాస్థాయి వరకు పార్టీ కమిటీలు, అనుబంధ సంఘాల కమిటీల నియామకాలు ఉంటాయని, పార్టీని సంస్థాగతంగా బలంగా... తీర్చిదిద్దడమే గాకుండా క్యాడర్‌కు శిక్షణాతరగతులు సైతం నిర్వహించి నిర్మాణాత్మక పాత్ర పోషించేలా తయారుచేస్తామని ఇటీవల పార్టీ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ ప్రకటించారు. ఈ నేపథ్యంలో సభ ముగిశాక ఆ కార్యాచరణ మొదలవుతుందని క్యాడర్ భావిస్తోంది. అదే సమయంలో త్వరలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ పోటీచేసేందుకు సిద్ధమవుతున్న స్థానిక నాయకులు సభకు జనసమీకరణ చేసేందుకు సిద్ధమయ్యారు. గ్రామాల్లో, మున్సిపల్ వార్డుల్లో క్యాడర్ చేజారకుండా వారందరినీ సభకు తీసుకెళ్లేందుకు సిద్ధమయ్యారు. సభలో కేసీఆర్ ప్రసంగం ద్వారా పార్టీకి పునరుత్తేజం వస్తుందని, సభ తర్వాత ప్రతిపక్షంగా పార్టీ కార్యాచరణ వేగవంతమవుతుందనే నమ్మకం క్యాడర్‌లో నెలకొంది.

ఎడ్లబండ్లు, పాదయాత్రలు, సైకిల్‌యాత్రలు

బీఆర్‌ఎస్ రజతోత్సవ సభకు సూర్యాపేట నియోజకవర్గం ఆత్మకూరు(ఎస్) మండలం నుంచి 16 ఎడ్లబండ్ల ద్వారా కార్యకర్తలు తరలివెళ్లారు. పలువురు యువనాయకులు, కార్యకర్తలు సైకిల్‌యాత్రల ద్వారా వెళ్తుండగా, కొందరు విద్యార్థులు, యువత పాదయాత్రగా వెళ్తున్నారు. మొత్తంగా పార్టీలో నూతనోత్సాహం కలిగేలా సభ నిర్వహిస్తామని, పార్టీని ముందుకు నడపడానికి ఈ సభ చక్కటి మార్గదర్శనం చేస్తుందని బీఆర్‌ఎస్ నేతలు పేర్కొంటున్నారు.

చాడలో బౌద్ధ చారిత్రక ఆనవాళ్లు

● శాతవాహనులు, ఇక్ష్వాకుల కాలం నాటివిగా గుర్తింపు

మోటకొండూరు, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): యాదాద్రిభువనగిరి జిల్లా మోటకొండూరు మండలం చాడ గ్రామంలో బౌద్ధానికి సంబంధించిన చారిత్రక ఆనవాళ్లు వెలుగుచూస్తున్నాయి. రెండు నెలలుగా గ్రామంలో పురావస్తు శాఖ ఆధ్వర్యంలో తవ్వకాలు నిర్వహిస్తుండగా, పురాతన నాణేలు, పూసలు, గాజులు లభిస్తున్నాయి. పురావస్తు శాఖ డిప్యూటీ డైరెక్టర్ నాగరాజు తెలిపిన వివరాల ప్రకారం.. చాడ గ్రామానికి చెందిన రైతు పెరిమెల్లి భూమయ్యగౌడ్ 2003వ సంవత్సరంలో తన ఎకరంన్నర పొలం దున్నుతుండగా కొన్ని పురాతన విగ్రహాలు లభ్యమవటంతో పురావస్తు శాఖకు సమాచారం అందింది. రైతు అనుమతితో పురావస్తు శాఖ అప్పటినుంచి తమ అధీనంలోకి తీసుకుని తవ్వకాలు చేపట్టింది. 2010సంవత్సరంలో బుద్ధుడి విగ్రహం, 2024సంవత్సరంలో కొన్ని విగ్రహాలను గుర్తించి మ్యూజియంకు తరలించారు. ఈ ఏడాది ఫిబ్రవరి 22వ తేదీన తవ్వకాలు ప్రారంభించగా, 2వ, 3వ శతాబ్దానికి చెందిన శాతవాహన, ఇక్ష్వాకుల కాలం నాటి నాణేలు, జంతువులు, మానవ సంబంధిత ఎముకలు, బుద్ధ విగ్రహం, పూసలు, గాజులు, ఇనుప వస్తువులు, అలంకరణతో కూడిన సున్నపు పలకలు, టెర్రకోట బొమ్మలు, రాగి, సీసపు నాణేలను గుర్తించారు. వీటిని అధికారుల సమక్షంలో స్థానికంగా భద్రపరచగా, హైదరాబాద్‌లోని మ్యూజియంకు తరలించనున్నారు.



మోటకొండూరు మండలం చాడ గ్రామ తవ్వకాల్లో బయటపడ్డ శాతవాహనుల కాలానికి చెందిన రంగుల పెంకులు



చాడ గ్రామంలో పురావస్తు శాఖ అధికారులు, తవ్వకాల్లో బయల్పడ్డ బుద్ధ విగ్రహం

బౌద్ధసన్యాసులు నివసించే 40విహారాలు

తవ్వకాల్లో భాగంగా బౌద్ధ సన్యాసులు నివసించిన 40 విహారాలు, ఇటుకలతో నిర్మించిన చైత్య గుడిని పురావస్తు సిబ్బంది గుర్తించారు. 80మంది కూలీలతో 80 సెంటీమీటర్ల లోతు తవ్వకాలు చేస్తుండగా, విహారాల నిర్మాణానికి ఉపయోగించిన ఇటుక పొడవు 56 సెంటీమీటర్లు, వెడల్పు 28 సెంటీమీటర్లు, మందం 9సెంటీమీటర్లు ఉన్నట్లు గుర్తించారు. మరో రెండు నెలలు తవ్వకాలు కొనసాగిస్తామని పురావస్తు శాఖ అధికారులు తెలిపారు. ఉమ్మడి జిల్లాలో వర్ధమనుకోట, ఫణిగిరి, పజ్జూరు, రాయగిరి, చాడలో తవ్వకాలు జరిపినట్లు ఆర్కియాలజీ శాఖ అధికారులు తెలిపారు.

మేళ్లచెర్వులో గంజాయి సాగు

● ధ్వంసం చేసిన పోలీసులు, నిందితుడిపై కేసు



గంజాయి మొక్కలను తూకం వేస్తున్న పోలీసులు

మేళ్లచెర్వు, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా మేళ్లచెర్వు మండల కేంద్రంలో సాగుచేస్తున్న నిషేధిత గంజాయి మొక్కలను ఎక్సైజ్, పోలీసులు దాడిచేసి ధ్వంసం చేశారు. కోదాడ రూరల్ సీఐ రజితారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మండలకేంద్రానికి చెందిన కలీం సుభాని గంజాయి సాగు చేస్తున్నాడని పోలీసులకు సమాచారం వచ్చింది. శనివారం స్థానిక పోలీసులు, ఎక్సైజ్ సిబ్బంది దాడి చేయగా, మేళ్లచెర్వు ఊరి చివరన ఇందిరమ్మ కాలనీలో ఇంటి వెనుక భాగంలో ఖాళీ స్థలంలో చుట్టూ పాత చీరలు కట్టి వాటి మధ్యలో గంజాయి సాగు చేస్తున్నట్లు గుర్తించారు. సుమారు 15 గంజాయి మొక్కలను ధ్వంసం చేయగా, వాటి విలువ బహిరంగ మార్కెట్లో రూ.1.50 లక్షలు ఉంటుందని, 450 గ్రాముల మొక్కలను ధ్వంసం చేసి కేసు నమోదు చేసి నిందితుడిని రిమాండ్‌కు తరలించామని సీఐ తెలిపారు. దాడుల్లో ఎస్‌ఐలు పరమేష్, దివ్య, కార్యదర్శి పవన్, పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

మద్యం మత్తులో యువకుడిపై కత్తితో దాడి

సూర్యాపేటక్రైం, ఏప్రిల్ 26,(ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో ఓ యువకుడిపై మరో యువకుడు కత్తితో దాడికి పాల్పడిన సంఘటన సూర్యాపేట జిల్లాకేంద్రంలో శనివారం జరిగింది. పట్టణ ఇన్‌స్పెక్టర్ వీరరాఘవులు తెలిపిన వివరాల ప్రకారం.. సూర్యాపేటలోని రాజీవ్‌నగర్‌కు చెందిన బొల్లం మధు రోజు వారీగా కూలీ పనులు చేస్తున్నా డు. అతడి మిత్రులైన సూర్యాపేటకు చెందిన శ్రవణ్‌తో పాటు మరో ఇద్దరు కలిసి శనివారం మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు చంద్రన్నకుంటలోని ఓ మద్యం బెల్టు దుకాణంలో మద్యం సేవించారు. అనంతరం సూర్యాపేట పట్టణ శివారులోని నల్లచెరువు వద్దకు వెళ్లారు. అక్కడ కూడా మద్యం సేవించే సమయంలో శ్రవణ్ తన వెంట తెచ్చుకున్న కత్తి జేబులో నుంచి తీసి మధుపై దాడి చేశాడు. గమనించిన ఇద్దరు మిత్రులు స్పందించి గాయపడిన మధును వెంటనే అక్కడి నుంచి ఆస్పత్రికి తరలించారు. బాధితుడు మధు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

కర్రెగుట్టల్లో కూంబింగ్ నిలిపివేయాలి

● సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి



కార్యక్రమంలో మాట్లాడుతున్న జూలకంటి రంగారెడ్డి

మిర్యాలగూడ, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): తెలంగాణ, ఛత్తీస్‌గడ్ రాష్ట్రాల సరిహద్దుల్లోని కర్రెగుట్టల్లో కేంద్ర ప్రభుత్వం కూబింగ్ నిలిపివేయాలని మాజీ ఎమ్మెల్యే, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి డిమాండ్ చేశారు. దండకారణ్యంలో కర్రెగుట్ట ఆపరేషన్ నిలిపివేసి మావోయిస్టులతో శాంతి చర్చలు చేయాలని కోరుతూ ఆదివాసి హక్కుల పోరాట సంఘీభావ వేదిక, వామపక్షపార్టీలు, ప్రజా సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో శనివారం నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా అమరవీరుల స్థూపం వద్ద జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కాశ్మీర్ లోయలో నరహంతక ఉగ్రమాకలను తుది ముట్టించాల్సిన సైన్యం మావోయిస్టుల పేరుతో ఈ దేశ మూలవాసులను, ఆదివాసి అమాయకులను హత మా ర్చడం సరికాదన్నారు. మావోల పేరుతో ఆదివాసులను అడవులనుంచి తరిమేసి అటవీ సంపదను కార్పొరేట్లకు దోచిపెట్టే వ్యాపార విధానంతో ప్రభు త్వం రాజ్యాంగ విరుద్ధంగా వ్యవహరించడం అమానుషమన్నారు. విద్యావంతుల వేదిక రాష్ట్ర అధ్యక్షుడు అంబటి నాగయ్య మాట్లాడుతూ రాజ్యాంగ బద్ధంగా పాలనలో హింసావాదాన్ని తగ్గించే దిశగా ముందుకు సాగాల్సిన కేంద్రం కగార్ పేరుతో అడవుల్లోని ఆదివాసుల హననానికి పాల్పడటం రాజ్యాంగ ఉల్లంఘనే అవుతుందన్నారు. వామపక్షపార్టీలు, కాంగ్రెస్, బీఆర్‌ఎస్ దండకారణ్యంలో ప్రభుత్వం కాల్పుల విరమణ శాంతి పాటించా లన్నారు. మట్టిమనుషుల వేదిక కన్వీనర్ వేనేపల్లి పాండురంగారావు మాట్లాడుతూ దేశంలో ఆదివాసులను చంపడం కొత్తేమికాదని అన్నారు. ప్రజా సంఘాల ఐక్యవేదిక కన్వీనర్ బీసం రామయ్య మా ట్లాడుతూ ఆపరేషన్ కగార్ పేరుతో భారత సైన్యం ఇప్పటికే 400 మందికిపైగా కాల్చివేసిందన్నారు. అందులో అమాయక ఆదివాసి గిరిజన బిడ్డలు అనేక మంది ఉన్నారని అన్నారు. కార్యక్రమంలో ఆదివాసీ హక్కుల పోరాట వేదిక ఉమ్మడి జిల్లా కో ఆర్డినేటర్ సుధాకర్‌రెడ్డి, కె. ప్రభాకర్, మౌజం హుస్సే న్, కుందా శ్రీనివాస్, డాక్టర్ రాజు, కిరణ్మయి, నాగమణి, జ్వాలా, భిక్షమయ్య, రాముడు శర్మ, హఫీజ్, హరి, మాధవరెడ్డి పాల్గొన్నారు.

నాన్నకు బుల్లెట్ బైక్ బహుమతిగా ఇచ్చేందుకు వెళ్తూ..

● రోడ్డు ప్రమాదంలో మృత్యువాత ● సెలవుల్లో సొంతూరులో ఉండాలని సంతోషంగా పయనమైన సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని ● కల నెరవేరముందే విషాదం ● సూర్యాపేట జిల్లాలో సంఘటన



యశస్విని(ఫైల్)

మునగాల, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): నాన్నకు బుల్లెట్ బైక్ బహుమతిగా ఇచ్చేందుకు అదే వాహనంపై వెళ్తున్న యువతిని రోడ్డు ప్రమాదం కబళించింది. సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని అయిన తన బిడ్డ సొంతూరికి వస్తుందన్న తల్లిదండ్రుల ఆనందం ఆవిరైంది. ఈ సంఘటన సూర్యాపేట జిల్లా మునగాల మండలంలోని ఆకుపాముల గ్రామ శివారులో శుక్రవారం రాత్రి జరిగింది. ఏఎస్‌ఐ దార వెంకటరత్నం తెలిపిన వివరాల ప్రకారం.. ఏపీ రాష్ట్రంలోని పశ్చిమగోదావరి జిల్లా భీమవరం మండలంలోని తందూరు చెందిన చెడే యశస్విని (24) హైదరాబాద్ గచ్చిబౌలిలో పీడబ్ల్యూసీ కంపెనీలో మూడు సంవత్సరాల నుంచి సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తోంది. తల్లిదండ్రులు వ్యవసాయం చేసుకుంటూ గ్రామంలోనే ఉంటున్నారు. నాన్నకు బుల్లెట్ బైక్ బహుమతిగా ఇవ్వాలని హైదరాబాద్‌లో బైక్ కొనుగోలు చేసింది. కాగా శని, ఆది సెలవు ఉండడంతో శుక్రవారం రాత్రి 7.00 సమయంలో హైదరాబాద్ నుంచి తన బంధువు, తోటి ఉద్యోగి బడ్డుకొండ అచ్యుతాకుమార్‌తో కలిసి కొనుగోలు చేసిన బుల్లెట్ బైక్‌పై సొంతూరికి బయలు దేరారు. ఈ క్రమంలో సూర్యాపేట జిల్లా ఆకుపాముల వద్ద రాత్రి 12.30 అర్ధరాత్రి రోడ్డు మీద గేదె కళేబరం పడి ఉంది. బైక్ దాన్ని ఢీకొనడంతో వెనుక కూర్చున్న యశస్విని రోడ్డు మీద పడిపోయింది. క్షణం తేడాతోనే అదే రోడ్డుపై అతివేగంగా విజయవాడ వైపు వెళుతున్న లారీ యశస్విని మీద నుంచి దూసుకుపోయింది. దీంతో ఆమె తల భాగం ఛిద్రమైంది. బైక్‌పై ఉన్న అచ్యుతాకుమార్‌కు స్వల్ప గాయాలయ్యాయి. విషయం తెలిసిన సీఐ రామకృష్ణారెడ్డి పోలీస్ సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని కోదాడ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. పోలీసులు యశస్విని తల్లిదండ్రులకు ఫోన్ చేసి విషయం చెప్పారు.

చెరువులో పడి..



రామ్మూర్తి మృతదేహం

అనంతగిరి, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా అనంతగిరి మండలం వాయిలసింగారంలో చెరువులో పడి ఒకరు మృతి చెందారు. గ్రామానికి చెందిన దేవులపల్లి రామ్మూర్తి (45) శుక్రవారం ఉదయం తమ గేదెలను వెతుక్కుంటూ వెళ్లగా ప్రమాదశాత్తు కాలుజారి వాయిలసింగారం గ్రామ ఊరచెరువులో పడిపోగా ఈత రానందున నీట మునిగి మృతి చెందారు. రామ్మూర్తి భార్య జ్యోతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు అనంతగిరి ఎస్‌ఐ నవీన్ తెలిపారు.

గుండెపోటుతో యువకుడు..



నరహరి(ఫైల్)

తుంగతుర్తి, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా తుంగతుర్తి మండలంలో గుండెపోటుతో యువకుడు మృతి చెందిన ఘటన శుక్రవారం రాత్రి జరిగింది. గ్రామస్థులు, బంధువుల వివరాల ప్రకారం.. మండల పరిధిలోని కొత్తగూడెం గ్రామానికి చెందిన పగలగాని నరహరి (32) రాత్రి ఛాతిలో నొప్పి రావడంతో తుంగతుర్తి ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ వైద్యుడు సూర్యాపేట ఏరియా తీసుకెళ్లాల్సిందిగా సూచనలుచేశారు. దీంతో నరహరి సూర్యాపేటకు తీసుకువెళ్తుండగా మార్గంమధ్యలో తీవ్రమైౖ గుండెనొప్పితో మృతి చెందాడు. నరహరికి భార్య, కుమారుడు ఉన్నారు. నరహరి కుటుంబ సభ్యులను కాంగ్రెస్ జిల్లానేతలు తిరుమల ప్రగడ కిషన్‌రావు, ఆవుల కొమరవెల్లి, సుదర్శన్, విడుదల వీరన్న, శ్రీను తదితరులు మృతదేహాన్ని సందర్శించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు.

కాల్వలో పడి బాలుడు..



శివతేజ(ఫైల్)

పెద్దఅడిశర్లపల్లి, ఏప్రిల్26 (ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు ఏఎమ్మార్పీ లింక్ కాల్వలో జారిపడి బాలుడు మృతిచెందిన ఘటన నల్లగొండ జిల్లా పెద్దఅడిశర్లపల్లి మండలం దుగ్యాల గ్రామంలో శనివారం చోటుచేసుకుంది. గుడిపల్లి ఎస్‌ఐ నర్సింహులు తెలిపిన వివరాల ప్రకారం.. దుగ్యాల గ్రామానికి చెందిన మట్టిపల్లి ముత్యాలు, ముత్యాలమ్మ కుమారుడు శివతేజ(11) పొలానికి వెళ్లారు. దాహం వేయడంతో పక్కనే ఉన్న ఏఎమ్మార్పీ లింక్ కాల్వ వద్దకు వెళ్లి నీరు తాగుతుండగా శివతేజ కాలుజారి నీటిని పడిపోయాడు. స్థానికులు గమనించి రక్షించబోగా, శివతేజ ఈత కాకపోవడంతో నీటిలో మునిగిపోయాడు. వెంటనే స్థానికులు నీటిలో దూకి బాలుడిని బయటకు తీశారు. పోలీసులకు సమాచారం అందించడంతో ఘటనా స్థలానికి చేరుకున్న ఎస్‌ఐ బాలుడి మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం దేవరకొండ ప్రభుత్వ మార్చురీకి తరలించారు. తండ్రి ముత్యాలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

కాటమయ్య రక్షణ కిట్లు..
గీత కార్మికులకు ఉపయోగం

● నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం



నకిరేకల్‌లో కాటమయ్య రక్షణ కిట్లు పంపిణీ చేస్తున్న వేముల వీరేశం

నకిరేకల్, ఏప్రిల్ 26, (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం కల్లుగీత కార్మికులకు పంపిణీ చేస్తున్న కాటమయ్య రక్షణ కిట్లు ఎంతో ఉపయోగపడుతాయని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. నకిరేకల్‌లో శనివారం కల్లుగీత కార్మికులకు కాటమయ్య రక్షక కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వీరేశం మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలో 500మంది కల్లుగీత కార్మికులకు కాటమయ్య రక్షణ కిట్లు పంపిణీ చేశామన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి అన్ని వర్గాల ప్రజలకు సహాయం చేసేందుకు నిరంతరం కృషి చేస్తున్నారన్నారు. గీత కార్మికులు తాటిచెట్టుపై నుంచి పడకుండా ప్రభుత్వం పంపిణీ చేస్తున్న రక్షణ కిట్లు గీత కార్మికులకు రక్షణ కల్పిస్తాయన్నారు.

క్షయ రహిత సమాజం కోసం కృషి చేయాలి

క్షయ రహిత సమాజంకోసం ప్రతిఒక్కరూ కృషి చేయాలని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. క్షయ వ్యాధికి సంబంధించిన వాల్ పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్షయ వ్యాధి లక్షణాలు ఉన్న వారికి ఉచితంగా పరీక్షలు నిర్వహించాలని, ఎప్పటికప్పుడు మందులు పంపిణీ చేసి ఆదుకోవాలన్నారు. కార్యక్రమాల్లో ఎక్సైజ్ సూపరింటెండెంట్ సంతోష్, నకిరేకల్ ఎక్సైజ్ సీఐ ఎం.మల్లయ్య, పీఏసీఎస్ ఛైర్మన్ నాగులవంచ వెంకటేశ్వర్ రావు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగాల పేరిట మోసం

● పలువురి నుంచి రూ.లక్షల్లో వసూలు చేసిన మోసగాడు
● మంత్రి, ఎమ్మెల్యేల పేర్లు చెబుతూ, ఫొటోలు చూపుతూ మోసానికి తెర

సూర్యాపేటక్రైం, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): అమాయకుల అవసరాన్ని ఆసరాగా చేసుకుని కొందరు మోసాలకు తెరలేపుతున్నారు. వివిధ ప్రభుత్వ శాఖల్లో వివిధ హోదాల్లో ఉద్యోగాలు ఇప్పిస్తామని నమ్మబలికి పలువురి నుంచి రూ.లక్షల్లో వసూలు చేశాడు ఓవ్యక్తి. బాధితుల ఫిర్యాదు మేరకు సూర్యాపేట పట్టణ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. కేసుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి.. ఖమ్మం జిల్లా పాలేరు నియోజకవర్గానికి చెందిన ఓ వ్యక్తి కొన్నేళ్లుగా సూర్యాపేటలోని భగత్‌సింగ్‌నగర్‌లో అద్దెకు నివాసముంటున్నాడు. కొన్నాళ్లపాటు పాలేరు నియోజకవర్గంలో ఓ యూట్యూబ్ ఛానల్ రిపోర్టర్‌గా పనిచేశాడు. ఆ సమయంలో రాజకీయ నాయకులతో ఏర్పడిన పరిచయాలను అడ్డం పెట్టుకుని అక్రమాలకు తెరలేపాడు. ఛానల్ రిపోర్టర్‌గా పని చేయడం బంద్ చేసి బీఆర్‌ఎస్ ప్రభుత్వంలోని ఓ మంత్రి(నాటి), ఎమ్మెల్యేలు, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంలోని మంత్రి, ఎమ్మెల్యేలతో తాను వివిధ సందర్భాల్లో దిగిన ఫొటోలను చూపి ఉద్యోగాలు ఇప్పిస్తానని పలువురిని నమ్మించాడు. సూర్యాపేటలోని ప్రభుత్వ మెడికల్ కళాశాలతోపాటు జనరల్ ఆస్పత్రిలో వివిధ హోదాల్లో ఔట్ సోర్సింగ్ పద్ధతిలో ఉద్యోగాలు ఇప్పిస్తానని నమ్మించాడు. అతడి మాటలకు మోసపోయిన సూర్యాపేటకు చెందిన కొందరు ఒక్కొక్కరు రూ.రెండు లక్షల నుంచి రూ.రెండున్నర లక్షల చొప్పున చెల్లించారు. సూర్యాపేటకు చెందిన వారే కాకుండా జిల్లాలోని కోదాడ, హుజూర్‌నగర్ ప్రాంతాలకు చెందిన వారు డబ్బులు చెల్లించినట్లు సమాచారం. అయితే డబ్బులు ఇచ్చిన వారికి బాండ్ పేపర్లు రాసి ఇచ్చాడు.

నెలలు గడుస్తున్నా ఉద్యోగాలు రాకపోవడంతో బాధితులు ఉద్యోగాల కల్పన విషయమై సంబంధిత వ్యక్తిని ప్రశ్నించారు. ఉద్యోగాలు రాకపోయినా తాము ఇచ్చిన డబ్బులు ఇవ్వాలని పట్టుబట్టారు. దీంతో బాధితులకు కనిపించకుండా తప్పించుకు తిరుగుతున్నాడు. చేసేది లేక బాధితులు పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేశారు. కాగా మోసగించిన వ్యక్తి కేసుకు సంబంధించి పోలీసులు అరెస్ట్ చేయకుండా ఉండేందుకు హైకోర్టు ద్వారా ముందస్తు బెయిల్ పొందారు. ఆ బెయిల్ పత్రాలను శనివారం పోలీస్‌స్టేషన్‌లో అందించేందుకు రాగా విషయం తెలుసుకున్న బాధితులు పోలీస్‌స్టేషన్ వద్దకు చేరుకున్నారు. తమ డబ్బులు ఇవ్వాలని నిలదీశారు. బాధితులు ఆందోళన చేయడంతో పోలీసులు కేసు నమోదు చేయడం జరిగిందని ఆందోళన చేయవద్దని బాధితులకు నచ్చచెప్పి పంపించారు.

లక్కారంలో యువకుడి ఆత్మహత్య

చౌటుప్పల్ రూరల్, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం లక్కారంలో ఓ యువకుడు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సీఐ మన్మధకుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. జయశంకర్ భూపాలపల్లి జిల్లాకు చెందిన మేకల మహేందర్ (26) గత 12 ఏళ్లుగా చౌటుప్పల్ మండలం లక్కారంలో నివసిస్తూ రిఫ్రిజిరేటర్ మెకానిక్‌గా పని చేస్తున్నాడు. శనివారం ఉదయం ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మహేందర్ స్నేహితుడు గమనించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు మహేందర్ తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. ఆత్మహత్యకు కారణాలు తెలియరాలేదు.

కారు బోల్తా పడి వ్యక్తికి గాయాలు



భూక్యా సతీష్‌ను తరలిస్తున్న స్థానికులు

వలిగొండ, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు కారు బోల్తా పడడంతో శనివారంఒక యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. 108 సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం.. మహబూబ్‌బాద్ నుంచి భూక్యా సతీష్ కారుపై హైదరాబాద్ వైపు వెళ్తున్నాడు. వలిగొండ మండలం నర్సాపూర్ వద్దకు రాగానే కారు అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో సతీష్‌కు తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం 108 సిబ్బంది భువనగిరి ఏరియా ఆస్పత్రికి తరలించారు.

CLASSIFIEDS

HOUSE FOR SALE

★ నల్లగొండ లోని HYDరోడ్ యందు రిలయన్స్ ట్రెండ్స్ వెనుక కాకతీయ కాలేజి దగ్గర, గ్రౌండ్ ఫ్లోర్ & ఫస్ట్ ఫ్లోర్ 3000 Sft. కలిగి 480 చ॥ గజముల స్థలం గల మంచి ఎలివేషన్‌తో ఉన్న సెమీ కమర్షియల్ భవనం అమ్మకమునకు కలదు. సెల్ : 8919187764

AJY_15911

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడివిటి

4 Lines CLASSIFIED
NLG+SRPT+YGT (3Dist)
210/- Only
Extra Line 45/- Only
For Ads Contact :
NALGONDA DIST
9985413365
9985413656
SURYAPET DIST
9703618713,
9985401015
YADADRI BHONGIRI DIST
9985410384

భూభారతి చట్టంపై అవగాహన సదస్సు రేపు

శాలిగౌరారం, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): శాలిగౌరారం మండల కేంద్రంలోని సీఎం ఆర్ ఫంక్షన్ హాల్‌లో ఈ నెల 28న సోమవారం ఉదయం 9 గంటలకు మండల స్థాయిలో భూభారతి చట్టంపై అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ యాదగిరి తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే మందుల సామేల్, ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, కలెక్టర్ ఇలా త్రిపాఠి హాజరుకానున్నట్లు తెలిపారు. అవగాహన సదస్సులో అన్ని గ్రామాల ప్రజలు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

ఆలయ భూమిలో అక్రమ కబ్జాలను తొలగించాలని వినతి

మునుగోడు, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): మునుగోడు మండలం చీకటిమామిడి గ్రామంలో 315 సర్వేనెంబర్‌లోని శ్రీరామాలయానికి చెందిన 4.20 ఎకరాల విస్తీర్ణం గల భూమిలో అక్రమ కబ్జాలను తొలగించాలని గ్రామస్థులు విజ్ఞప్తి చేశారు. తహసీల్దార్ నరేందర్‌కు వినతిపత్రం అందజేశారు. గతంలో అధికారులు అక్రమకబ్జాలను తొలగించి హద్దులు గుర్తించి కడీలు పాతారు. కార్యక్రమంలో నాయకులు కర్నాటి లింగయ్య, పాలకూరి యాదయ్య, తాటికొండ సంతోషసైదులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

రుణాలు సద్వినియోగం చేసుకోవాలి

రాములు, ఏపీఎం, శాలిగౌరారం



మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయడమే గ్రామీణ పేదరిక సంస్థ యొక్క ముఖ్య ఉద్దేశ్యమని, స్త్రీనిధి, బ్యాంకు రుణాలు తీసుకున్న మహిళా సభ్యులు సద్వినియోగం చేసుకోవాలని ఏపీఎం ధర్నోబోయిన రాములు తెలిపారు.

(శాలిగౌరారం, ఆంధ్రజ్యోతి)

ఇంటర్వ్యూ Interview

ఆంధ్రజ్యోతి: శాలిగౌరారం మండలంలో ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఎన్ని ఏర్పాటు చేశారు?

ఏపీఎం: మండలంలో ఏడు ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశాం.

ఆంధ్రజ్యోతి: ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఎక్కడెక్కడ ఏర్పాటు చేశారు?

ఏపీఎం: శాలిగౌరారం మండలంలోని చిత్తలూరు, తుడిమిడి, గురజాల, నూలగడ్డ కొత్తపల్లి, భైరవునిబండ, రామానుజపురం, ఆకారం గ్రామాల్లో ఐకేపీ కేంద్రాలు నడుస్తున్నాయి.

ఆంధ్రజ్యోతి: మండలంలో ఎన్ని గ్రామ మహిళాసంఘాలు, ఎన్ని స్వయం సహాయక మహిళా సమభావన సంఘాలు ఉన్నాయి? మొత్తం ఎంతమంది సభ్యులున్నారు?

ఏపీఎం: మండలంలో గ్రామ మహిళా సంఘాలు 32 స్వయం సహాయక సమభావన సంఘాలు 1025 ఉన్నాయి. మొత్తం సభ్యులు 11102మంది ఉన్నారు.

ఆంధ్రజ్యోతి: ఎన్ని సంఘాల సభ్యు లకు బ్యాంకుల ద్వారా ఎన్ని కోట్ల రుణాలు ఇప్పించారు?

ఏపీఎం: 291 సంఘాలకు 3 కోట్ల 20 లక్షల రూపాయల బ్యాంకు రుణాలు ఇప్పించడం జరిగింది.

ఆంధ్రజ్యోతి: స్త్రీనిధి ద్వారా ఎన్ని సంఘాలకు, ఎన్ని కోట్ల రూపాయల రుణాలు ఇప్పించారు?

ఏపీఎం: స్త్రీనిధి ద్వారా 154 సంఘాలకు రూ.3.69 కోట్ల రూపాయల రుణాలు ఇప్పించడం జరిగింది.

ఆంధ్రజ్యోతి: మీ సిబ్బంది సకాలంలో విధులకు హాజరుకావడం లేదనే ఫిర్యాదులు వస్తున్నాయి?

ఏపీఎం: మా సిబ్బంది సకాలంలోనే విధులకు హాజరువుతున్నారు. కొంతమంది ఫీల్డ్ వర్క్ ఉన్నపుడు గ్రామాలకు వెళ్తున్నారు.

విద్యుత్ సబ్‌స్టేషన్‌లో వసతులు కరువు



శాలిగౌరారంలోని 33/11కేవీ విద్యుత్ సబ్ స్టేషన్

- తాగునీరు, టాయిలెట్స్ లేక సిబ్బందికి తప్పని ఇబ్బందులు
- శిథిలావస్థలో ఆపరేటర్ భవనం
- ఇబ్బందులు పడుతున్న ఆపరేటర్లు
- పట్టించుకోని అధికారులు

శాలిగౌరారం, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ సబ్‌స్టేషన్లలో వసతులు కరువయ్యాయి. విధులు నిర్వహించే సిబ్బందికి కనీస వసతులు లేక అవస్థలు పడుతున్నారు. విద్యుత్ అధికారులు, ప్రజాప్రతినిధుల అలసత్వం కారణంగా శాలిగౌరారంలోని విద్యుత్ సబ్‌స్టేషన్‌లో కనీస వసతులు లేక సిబ్బంది, రైతులు ఇబ్బందులు పడుతున్నారు. దాదాపు 40 ఏళ్లక్రితం నిర్మించిన ఈ సబ్‌స్టేషన్‌లో వసతుల కల్పనపై స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారుల పట్టించుకోవడం లేదని సిబ్బంది పేర్కొంటున్నారు. సబ్‌స్టేషన్‌లో తాగునీరు, వాడకం నీరు, టాయ్‌లెట్లు లేకపోవడంతో విద్యుత్ సిబ్బంది, ఆపరేటర్లు, రైతులు అవస్థలు పడుతున్నారు. తాగునీటిని బయట నుంచి ఖరీదు చేసుకొని తాగుతున్నామని సిబ్బంది, ఆపరేటర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. టాయిలెట్స్ లేనందున మూత్ర, మల విసర్జనకు, స్నానం చేయడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు వాపోయారు. కడుక్కోవడానికి, స్నానం చేయడానికి కూడా నీటి సౌకర్యం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వెంటనే సంబంధిత అధికారులు స్పందించి ఈ సబ్‌స్టేషన్‌లో ఒక బోరు వేయించి నీటి సౌకర్యం, టాయిలెట్ల సౌకర్యం కలిపించాలని సిబ్బంది కోరుతున్నారు.

శిథిలావస్థలో ఆపరేటర్ భవనం

సబ్‌స్టేషన్ ప్రాంగణంలో ఉన్న ఆపరేటర్ భవనం కూడా శిథిలావస్థకు చేరింది. నాలుగు గదులున్న ఈ భవనంలో ఒక గదిలో ఏఈ కార్యాలయం, ఒక గది ఆపరేటర్లకు, రెండు గదులు స్టోరేజికి కేటాయించారు. ప్రస్తుతం ఈ గదులు కూడా శిథిలావస్థకు చేరడంతో అధికారులు, సిబ్బందికి ఇబ్బందులు తప్పడం లేవు. గదులకు ఉన్న తలుపులు విరిగిపోయాయి. కిటికీలకు అసలు తలుపులే లేవు.

వర్షం వస్తే కురుస్తుందని, పాములు, తేళ్లు వస్తున్నాయని ఈ భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరి రక్షణ కరువై అసౌకర్యంగా ఉందని అధికారులు, సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వివిధ గ్రామాల నుంచి ఏఈ కొరకు రైతులు నిత్యం వస్తుంటారు. వీరికి కూర్చోవడానికి కుర్చీలు కూడాలేవు. నూతనంగా ఆపరేటర్ భవనంతో పాటు, ఒక ఏఈ కార్యాలయ భవనాన్ని కూడా నిర్మిస్తే అందరికీ అనుకూలంగా ఉంటుందని సిబ్బంది, ఆపరేటర్లు కోరుతున్నారు.



శిథిలావస్థకు చేరిన ఆపరేటర్ భవనం

తాగునీరు, టాయిలెట్ల్ సౌకర్యం కల్పించాలి



ఈ సబ్‌స్టేషన్‌లో డ్యూటీ చేయడం కష్టంగా ఉంది. కనీస వసతులు లేవు. ఆపరేటర్ భవనం కూడా శిథిలావస్థకు చేరి ఇరుకుగా ఉంది. పాములు, తేళ్లు గదుల్లోకి వస్తున్నాయి. తాగడానికి నీళ్లు లేవు, టాయిలెట్స్ అసలే లేవు. సంబంధిత అధికారులు స్పందించి ఈ సబ్‌స్టేషన్‌లో కనీస వసతులు కల్పించాలి.

\- కోమటిరెడ్డి బుచ్చిరెడ్డి, సబ్‌స్టేషన్‌ఆపరేటర్, శాలిగౌరారం

అధికారుల దృష్టికి తీసుకెళ్తా



సబ్ స్టేషన్‌లో కనీస వసతుల ఏర్పాటుకు అధికారుల దృష్టికి తీసుకెళ్తాను. ఇప్పుడున్న ఆపరేటర్ భవనం సరిపోవడం లేదు. నూతనంగా ఏఈ భవనంను నిర్మించాలని అధికారులకు ప్రతిపాదనలు పంపాము. నీటి సౌకర్యం, టాయిలెట్స్ ఏర్పాటుకు అధికారులకు నివేదిస్తాను.

\- గోగుల శ్రీధర్, ఏఈ విద్యుత్, శాలిగౌరారం

తెలంగాణ ఉద్యమకారుల జేఏసీ జిల్లా అధ్యక్షుడిగా రవి



రవి

నార్కట్‌పల్లి, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఉద్యమకారుల జాయింట్ యాక్షన్ కమిటీ (జేఏసీ) జిల్లా నూతన అధ్యక్షుడిగా నార్కట్‌పల్లి మండలం ఏపీలింగోటం గ్రామానికి చెందిన అంతటి రవి నియమితులయ్యారు. ఈ మేరకు జేఏసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంగిశెట్టి క్లిస్టఫర్ శనివారం నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమంలో పాల్గొని త్యాగాలు చేసిన ఉద్యమకారుల సంక్షేమానికి తనవంతు పోరాటం చేస్తానని అన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర సహాయ కార్యదర్శి సంగిశెట్టి జనార్ధన్, పబ్బు లక్ష్మయ్య, గాజుల యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

కార్మిక హక్కులను కాలరాస్తున్న కేంద్రం



సమావేశంలో మాట్లాడుతున్న లక్ష్మీనారాయణ

నార్కట్‌పల్లి, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): నరేంద్రమోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం కార్మిక హక్కులను కాలరాస్తోందని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు చినపాక లక్ష్మీనారాయణ అన్నారు. కార్మికులు పోరాడి సాధించుకున్న 44 చట్టాలను రద్దుచేసి నాలుగు లేబర్ కోడ్లుగా మార్చిందని విమర్శించారు. శనివారం నార్కట్‌పల్లి మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్మికుల రెక్కల కష్టంతో రూపుదిద్దుకున్న ప్రభుత్వ రంగ సంస్థలను బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్ రంగాలకు ధారాదత్తం చేస్తుందని ఆరోపించారు. ఫలితంగా సామాజిక న్యాయం దెబ్బతిని అణగారిన ప్రజలు అన్యాయానికి గురవుతున్నారని ఆవేదన చెందారు. మోదీ విధానాలను నిరసిస్తూ మే 20వ తేదీన దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెకు కార్మికులు మద్దతు తెలిపి విజయవంతం చేయాలని లక్ష్మీనారాయణ పిలుపునిచ్చారు. సమావేశంలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి చింతపల్లి బయ్యన్న, నాయకులు చింత సంగీత, లింగాల నరసమ్మ, చెర్కు శ్రీకాంత్, మారయ్య, యాదయ్య, అంజయ్య, శ్యామల, పవిత్ర, ఎల్లమ్మ, లింగమ్మ పాల్గొన్నారు.

ప్రాజెక్టు ఫీడర్ ఛానల్‌లో రైతుల శ్రమదానం

● గుర్రపు డెక్క, చెత్తచెదారాన్ని తొలగించిన రైతులు



గుర్రపు డెక్కను తొలగిస్తున్న గురజాల రైతులు

శాలిగౌరారం, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): ఎవరో వస్తారని ఏదో చేస్తారని ఎదురు చూడకుండా గ్రామ రైతులు కొందరు శ్రమదానం చేశారు. శాలిగౌరారం ప్రాజెక్టుకు అనుసంధానంగా ఉన్న ఫీడర్ ఛానల్‌లో అమ్మనబోలు జలకుంట హెడ్ వర్క్ షట్టర్ల వద్ద పేరుకుపోయిన గుర్రపు డెక్క, చెత్తచెదారాన్ని శాలిగౌరారం మండలం గురజాల గ్రామ రైతులు పది మంది తొలగించారు. పల్లివాడ నుంచి కొత్తపల్లి వరకు ఉన్న ఈ ఫీడర్ ఛానల్‌లో అక్కడ డక్కడ గుర్రపు డెక్క పేరుకుపోయి శాలిగౌరారం ప్రాజెక్టులోకి నీరు సాఫీగా రావడం లేదు. అధికారులు గుర్రపు డెక్కను తొలగించడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. అధికారుల అలసత్వం వల్లే శాలిగౌరారం ప్రాజెక్టులోకి నీరు సక్రమంగా రావడం లేదని, తామే స్వయంగా గుర్రపు డెక్కను శ్రమదానంతో తొలగించామని పేర్కొన్నారు. కార్యక్రమలో రైతు సంఘం నాయకులు చామల వెంకటరమణారెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ పడాల రమేష్, గురజాల మాజీ సర్పంచ్ ననుబోతు అంజయ్య, ఎన్ఎస్‌యూఐ మండల అధ్యక్షుడు లొడంగి మహేష్, లొడంగి సైదులు ఆధ్వర్యంలో రైతులు తదితరులు శ్రమదానంలో పాల్గొన్నారు.

నీటిశుద్ధి యంత్రం ప్రారంభం

నార్కట్‌పల్లి, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): నార్కట్‌పల్లి మండలం పోతినేనిపల్లిలో తన సొంత నిధులతో ఏర్పాటు చేసి నీటి శుద్ధి యంత్రాన్ని ఎమ్మెల్యే వేముల వీరేశం శనివారం ప్రారంభించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బత్తుల ఊశయ్య, నాయకులు దూదిమెట్ల సత్తయ్య, సామ నరేందర్‌రెడ్డి, సట్టు సత్తయ్య, పుల్లెంల అచ్చాలు, భరత్‌గౌడ్, ఆదిమళ్ల నర్సింహ, రేగట్టె నర్సిరెడ్డి, పాశం లింగారెడ్డి, నర్సింహ, ఎంపీడీవో ఉమేష్‌చారి, ఎంపీవో సుధాకర్, పంచాయతీ కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ సేవా భావంతో ముందుకురావాలి

నల్లగొండరూరల్, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): ప్రతీ ఒక్కరూ సేవాభావంతో తనవంతు సహకారాలు అందించేందుకు ముందుకు రావాలని ఐద్వా పట్టణ కార్యదర్శి భూతం అరుణకుమారి అన్నారు. అశోక్ టారిటబుల్ ట్రస్ట్ అధినేత గుళ్లగట్లు అశోక్ కుమార్ పుట్టినరోజు సందర్భంగా శనివారం స్థానిక క్లాక్‌టవర్ సెంటర్‌లో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అరుణకుమారి మాట్లాడుతూ యువత పుట్టిన రోజు పేరుతో మద్యం తాగి, ఇష్టానుసారంగా వాహనాలు నడుపుతూ ప్రమాదాలకు కారణమవుతున్నారని అన్నారు. మద్యం మత్తులో చేసిన ప్రమాదాల్లో కుటుంబ పెద్దలు కొల్పోయి వారి పిల్లలు అనాధలుగా మారుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు బొరుగుండ్ల నాగమణి, మారెడ్డి మౌనిక, చేగోని మౌనిక తదితరులు పాల్గొన్నారు.

నేరడలో చిన్నారులకు కంటి పరీక్షలు

చిట్యాల రూరల్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నేరడలో ఆర్‌బీఎస్‌కే కింద అంగన్‌వాడీ కేంద్రంలోని చిన్నారులకు కంటి పరీక్షలు నిర్వహించారు. స్కీనింగ్ చేసి వారికున్న కంటి సమస్యలను పరీక్షించారు. కార్యక్రమంలో సీడీపీవో లావణ్యకుమారి, వైద్యులు శ్రీనివాస్, గాయత్రి, రజిత, అనిల్‌బాబు పాల్గొన్నారు.

మేడే ను జయప్రదం చేయాలి : ఎమ్మెల్సీ సత్యం



మేడే పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం

నల్లగొండ రూరల్, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): అమెరికాలోని చికాగో నగరంలో కార్మికుల రక్తంతో తడిసిన పోరాట దినోత్సవం నిర్వహించే మేడేని కార్మికులంతా ఘనంగా నిర్వహించాలని ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం అన్నారు. పట్టణంలోని ఏఐటీయూసీ జిల్లా కార్యాలయంలో శనివారం నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్సీ సత్యం మేడే పోస్టర్ ఆవిష్కరించి మాట్లాడారు. కార్మికులు కొట్లాడి సాధించుకున్న అనేక కార్మిక చట్టాలను రద్దుచేస్తూ, పని గంటలను కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా 12 గంటలుగా మార్చడానికి కేంద్రప్రభుత్వం లేబర్ కోడ్‌లను ముందుకు తీసుకువచ్చిందని విమర్శించారు. దేశంలో అసంఘటితరంగా కార్మికులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నా వారికి కనీసం పని భద్రత, ఎలాంటి సౌకర్యాలు లేవని, కనీస వేతనాలకు నోచుకోక వారు దుర్భర జీవితం కొనసాగిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నాలుగు లేబర్ కోడ్‌ల అమలు వల్ల కార్మికుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారుబోతుందని అన్నారు. అన్ని మండల, గ్రామాల్లోని పని ప్రదేశాల్లో జెండాలు ఎగురవేయాలన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లా దేవేందర్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు కేఎస్ రెడ్డి, పానేమ్ వెంకటరావు, డివిజన్ కార్యదర్శి లేనిన్, గుండె రవి, జి.నరేందర్, తదితరులు పాల్గొన్నారు.

'ఇందిరమ్మ' సర్వే పారదర్శకంగా నిర్వహించాలి



చామలపల్లిలో సర్వే నిర్వహిస్తున్న ఎంపీడీవో యాదగిరి

చండూరురూరల్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్ని గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల సర్వేను పారదర్శకంగా చేపట్టాలని ఎంపీడీవో బండారు యాదగిరి అన్నారు. ప్రభుత్వం చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల పంపిణీ ప్రక్రియలో భాగంగా మండలంలో క్షేత్రస్థాయిలో సర్వే నిర్వహించినట్లు తెలిపారు. శనివారం మండల పరిధిలోని చామలపల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల సర్వేలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రతీ గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల ఎంపికలో క్షేత్రస్థాయిలో వెళ్లి పారదర్శంగా సర్వే నిర్వహించాలని, అర్హులైన వారిని ఎంపిక చేసే విషయంలో ఎలాంటి అవకతవకలు జరగకుండా చూసుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు నిబంధనలు అందరూ పాటించాలి



సదస్సులో మాట్లాడుతున్న సీఐ కొండల్‌రెడ్డి

కేతేపల్లి, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): రహదారులపై ప్రయాణించే సమయాల్లో ప్రతి ఒక్కరూ రోడ్డు నిబంధనలు పాటించి ప్రమాదాల నుంచి బయట పడాలని శాలిగౌరారం సీఐ కొండల్‌రెడ్డి సూచించారు. రోడ్డు ప్రమాదాల నివారణపై కేతేపల్లిలో శనివారం రాత్రి నల్లగొండ జిల్లా జాగృతి పోలీసు కళా బృందం ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. రహదారులపై రాంగ్‌రూట్‌లో ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రయాణించవద్దని అన్నారు. పాదచారులు, ద్విచక్ర వాహనదారులు హైవేను దాటే క్రమంలో జాగురుకతతో వ్యవహరించాలని సూచించారు. పోలీసు కళాబృందం రోడ్డు ప్రమాదాల బారిన పడకుండా ఉండే చర్యలను తమ ఆటాపాటల ద్వారా సదస్సుకు హాజరైన వారికి వివరించారు. మండలంలో దాదాపు 15కి.మీ. నిడివి గల 65వ నెంబరు జాతీయ రహదారిపై ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదాల్లో ఎక్కువగా స్థానికులే మృతి చెందారని అన్నారు. దీనికి రోడ్డు భద్రతపై స్థానికులకు వగాహన లేకపోవడమే కారణంగా తాము భావిస్తున్నామన్నారు. ప్రతి ఒక్కరూ విధిగా రోడ్డు భద్రతా చర్యలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో కేతేపల్లి ఎస్ఐ ఎ.శివతేజగౌడ్, ఏఎస్ఐ నాయిని శ్రీనివాస్, మార్కెట్ డైరెక్టర్ ఎస్‌కె. లతీఫ్, డీటీఆర్పీ కె.ఎం.రాజు, నల్లగొండ పోలీసు కళా బృందం సభ్యులు ఎల్.చంద్రశేఖర్, ఎ.పురుషోత్తం, కె.మురళి, పి.సత్యం, పలువురు స్థానిక పోలీసు సిబ్బంది, ఆటో డ్రైవర్లు, స్థానిక యువకులు, రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

ఫార్మా కంపెనీల అనుమతులను రద్దు చేయాలి



చిట్యాలలో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మార్కెట్ చైర్మన్ వెంకటేశ్వర్లు

● ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు

గట్టుప్పల్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): మునుగోడు నియోజకవర్గంలో విచ్చలవిడిగా నెలకొల్పుతున్న ఫార్మా కంపెనీలను తరిమికొట్టేందుకు ప్రజలు సిద్ధం కావాలని ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి తీర్పారి వెంకటేశ్వర్లు, వ్యకాస జిల్లా ప్రధాన కార్యదర్శి బొలుగురి నరసింహ కోరారు. పట్టణంలో శనివారం నిర్వహించిన మండల కౌన్సిల్ సమావేశంలో వారు ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. టీఆర్ఎస్ ప్రభుత్వంలో ఫార్మా కం పెనీలకు విచ్చలవిడిగా అనుమతులు ఇచ్చారని, అనుమతు లు రద్దయ్యేంతవరకు పోరాడుతామని అన్నారు. గట్టుప్పల్, కిష్టాపురం, వెలిమినేడు, చౌటుప్పల్ లాంటి ప్రాంతాల్లో ప్రమాణాలు పాటించని కంపెనీలకు కూడా అనుమతులు ఇచ్చారని దీనికా రణంగా వాతావరణం కాలుష్యం ఏర్పడి ప్రజలు ఈ ప్రాంతం లో నివాసం ఉండలేని పరిస్థితి ఏర్పడిందని అన్నారు. నిరుద్యోగ యువతకు స్థానిక పరిశ్రమలలో ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయాలని సంక్షేమ పథకాల అమలులో అధికారులు నిష్పక్షపాతంగా వ్యవహరించాలని కోరారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించే అధికారులపై పోరాటం తప్పదని హెచ్చరించారు. ఈ సమావేశానికి రాపోలు సత్తయ్య అధ్యక్షత వహించగా మండల కార్యదర్శి భీమనపల్లి రమేష్, మండల నాయకులు కారింగు శ్రీను, కందాల ముత్యం, దెండె నరసింహ, లక్ష్మయ్య, ధర్మయ్య, రాములు పాల్గొన్నారు.

కార్మిక వ్యతిరేక విధానాలపై పోరాటాలకు సిద్ధం కావాలి

● ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్షుడు చంద్రమౌళి

నాంపల్లి, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రజా వ్యతిరేక విధానాలను అమలు చేస్తూ రైతులను, కార్మికులను ఇబ్బందులకు గురి చేస్తూ వారి హక్కులను కాలరాస్తుందని ప్రజా నాట్యమండలి జిల్లా అధ్యక్షుడు నాంపల్లి చంద్రమౌళి అన్నారు. మండల కేంద్రంలో సీఐటీయూ కార్యాలయంలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో మేడే కరప త్రాన్ని ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మే డే వేడుకలను వాడవాడలో ఘనంగా నిర్వహించాలని ఆయన పిలుపునిచ్చారు.

ఎర్ర జెండాలు ఎగరవేస్తూ ప్రభుత్వాలు అమలు చేస్తున్న వ్యతిరేక చట్టాలపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో నాయకులు గొల్లబోయిన అండాలు, గణేష్, మరియమ్మ, కవిత, సునీత, యాదమ్మ, నీలిమ, లక్ష్మణ్, స్వామి, వెంకటేష్, రవి, రాములమ్మ సులోచన, ఈరమ్మ, చంద్రమ్మ, తదితరులు పాల్గొన్నారు

కేసీఆర్ నాయకత్వంలోనే ప్రజలకు మేలు

● మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి



కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి

నల్లగొండ, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): కేసీఆర్ నాయకత్వంలోనే అన్ని వర్గాల ప్రజలకు మేలు జరుగుతుందని మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని క్యాంపు కార్యాలయంలో శనివారం నల్లగొండ మండలం అనంతారం గ్రామానికి చెందిన పలువురు మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో విఫలమైందని అన్నారు. కాంగ్రెస్ మోసం చేసిందన్న కోపంతో ఉన్న ప్రజలు ప్రభుత్వంపై మండి పడుతున్నారని అన్నారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్‌కు గుణపాఠం చెప్పడం ఖాయమన్నారు. బీఆర్ఎస్‌లో శివకుమార్, రుద్రాక్షి సాయి, రుద్రాక్షి స్వామి, కుమార్‌ల నాయకత్వంలో చేరారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు దేప వెంకట్‌రెడ్డి, గాదె రాంరెడ్డి, తుమ్మల లింగస్వామి, శంకర్, సైదులు, జైపాల్‌రెడ్డి, మహేష్, వెంకన్న, సైదులు తదితరులు పాల్గొన్నారు.

వక్ఫ్‌బోర్డులో ఎలాంటి ఆక్రమణలు జరగలేదు

● ఆర్డీవో, ఇన్‌చార్జి డీఆర్‌వో అశోక్ రెడ్డి



అశోక్‌రెడ్డి

నల్లగొండ, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రం సమీపంలోని 779 సర్వే నెంబర్ వక్ఫ్‌బోర్డు భూమిలో ఎలాంటి ఆక్రమణలు జరగలేదని ఆర్డీవో, ఇన్‌చార్జి డీఆర్వో వై.అశోక్‌రెడ్డి తెలిపారు. శనివారం ఆర్డీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు శనివారం వక్ఫ్‌బోర్డుకు సంబంధించిన 779 సర్వే నెంబర్ పక్కన ఉన్న సదాశివ వెంచర్‌లోని ప ట్టా భూములు 820, 821, 822, 826, 827 సర్వే నెంబర్లను ఉమ్మడిగా వక్ఫ్‌బోర్డు అధికారులతో పాటు రెవెన్యూ అధికారులు, సర్వేయర్లతో కలిసి అందరి సమక్షంలో సర్వే చేసినట్లు తెలిపారు. కలెక్టర్ ఇలా త్రిపాఠితో పాటు వక్ఫ్‌బోర్డు సీఈవో ఆదేశాల మే రకు ఈ సర్వే చేసినట్లు తెలిపారు. 779 సర్వే నెంబర్ పక్కన ఉన్న మిగతా పట్టభూముల యజమానులకు నోటీసులు ఇచ్చి క్షేత్రస్థాయిలో సర్వే నిర్వహించి హద్దులు కూడా నిర్వహించనట్లు తెలిపారు. 779 సర్వేనెంబర్ భూమిలో ఇంచు భూమి కూడా ఆక్రమణకు గురికాలేదని తెలిపారు. నివేదికను కలెక్టర్‌తో పాటు వక్ఫ్‌బోర్డు అధికారులకు నివేదించనున్నట్లు పేర్కొన్నారు. సర్వేలో తనతో పాటు డిప్యూటీ సర్వేయర్ శ్రీనివాస్, తహసీల్దార్ శ్రీనివాస్, సర్వేయర్ సైదులు, వక్ఫ్‌బోర్డు ఇన్‌స్పెక్టర్, పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

ఉగ్రదాడికి నిరసనగా శాంతి ర్యాలీ

చిట్యాల రూరల్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): కశ్మీర్‌లో ఉగ్రదాడికి నిరసనగా మండలంలోని గుండ్రాంపల్లిలో ముస్లింలు శాంతిర్యాలీ నిర్వహించారు. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా, హిందుస్తాన్ జిందాబాద్ అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో మసీద్ కమిటీ అధ్యక్షుడు జహంగీర్, మోసిన్, అసద్‌అలి, వాజీద్, బాబా, యుసుఫ్, గాలీబ్, హన్ను, ఖాలిద్, సాజిద్, సోహెల్, అఫ్జల్, ఉమర్, అదిల్, మెల్బాబ్, అమన్, ఉమన్, ఆసిఫ్, సమీర్, అబ్బాస్, అల్తాఫ్‌లు తదితరులు పాల్గొన్నారు.

వెల్మినేడులో: వెల్మినేడులో డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఉగ్రవాదుల దాడి ప్రజాస్వామ్యంపై దాడిగా పలువురు అన్నారు. కార్యక్రమంలో పంది నరేశ్, కూనూరు గణేష్, గోలి సాయికిరణ్, దేశబోయిన నర్సింహ, ఆడపు రమేష్, అరూర్ పవన్, మనోజ్, తరుణ్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

వేద పాఠశాలకు కూలర్లు బహూకరణ


నల్లగొండ కల్చరల్, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): ఎండ వేడిమి, ఉక్కపోతతో ఇబ్బంది పడుతున్న పానగల్‌లోని వేంకటేశ్వర వేద పాఠశాల విద్యార్థులుకు రుద్రసేన సభ్యులు 9 కూలర్లను అందజేశారు. శనివారం పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో పాఠశాల ప్రధానాచార్యులకు అందజేశారు. ఈ సందర్భంగా రుద్రసేన చైర్మన్ గంట్ల అనంతరెడ్డి మాట్లాడుతూ వేదం పఠిస్తున్న విద్యార్థులకు సేవ చేయడం పూర్వజన్మ సుకృతమని, ఛాయా సోమేశ్వరస్వామి ఆశీస్సులతో ముందు అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తానని అన్నారు. అనంతరం ప్రధానాచార్యులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో రుద్రసేన సభ్యులు శ్రీనివాస్‌శర్మ, రమణ, గండగోని సోమశేఖర్ గౌడ్, నోముల వెంకటేశ్వర్లు, కాసర్ల శేఖర్‌రెడ్డి, హరిబాబు, బోనగిరి మహేందర్, పర్వత్‌రెడ్డి, భరత్‌రెడ్డి, వేద పాఠశాల ప్రధానాచార్యులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

అభివృద్ధిని అడ్డుకుంటున్న బీఆర్ఎస్

చిట్యాల, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలకు ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ అడుగడుగునా అడ్డుపడుతుందని మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కాటం వెంకటేశం, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గుడిపాటి లక్ష్మీనర్సింహ విమర్శించారు. చిట్యాలలో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మూసీ ప్రక్షాళన, ఫోర్త్ సిటీ విషయంలో ప్రజలను రెచ్చగొట్టి పనులకు అడ్డుపడుతున్నట్లు తెలిపారు. ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను దశల వారీగా ప్రభుత్వం అమలు చేస్తోందని అన్నారు. ఉనికి కోసమే బీఆర్ఎస్ సభల పేరిట హడావుడి చేస్తోందని విమర్శించారు. కార్యక్రమంలో నాయకులు అంతటి వెంకటేష్‌గౌడ్, అద్దెల లింగారెడ్డి, కోనేటి యాదగిరి, పల్లపు బుద్దుడు, కాటం సత్తయ్య, గోపగోని నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నియంత్రణకు సహకరించాలి

చిట్యాల, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): చిట్యాల పట్టణంలోని భువనగిరి రోడ్డులో గల వివిధ దుకాణాల యజమానులు ట్రాఫిక్ నియంత్రణకు సహకరించాలని నార్కట్‌పల్లి సీఐ నాగరాజు కోరారు. శనివారం షాప్‌ల యజమానులతో పోలీస్‌స్టేషన్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. హైవేపై ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనులు జరుగుతున్న నేపథ్యంలో భువనగిరి రోడ్డులో ట్రాఫిక్ పెరిగినందున దుకాణాల యజమానులు పార్కింగ్ విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ ధర్మా, అధికారులు శ్రీను, శ్రవణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



హెల్ప్‌లైన్ నంబర్లు

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980

నల్లగొండ	:18004251442
యాదాద్రి	:1800 425 7106
సూర్యాపేట	:1800 425 1972

చికెన్ ధరలు

గుడ్డు డజన్ ధర : 66

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.162	240	270
సూర్యాపేట	రూ.165	220	250
నల్లగొండ	రూ.155	215	240

ఉష్ణోగ్రత గరిష్ఠం 41.0 । కనిష్ఠం 25.4



రజతోత్సవానికి గులాబీ దళం

- ఉమ్మడి జిల్లా నుంచి లక్ష మందిని తరలించేందుకు ఏర్పాట్లు
- వాహనాలను సిద్ధం చేసిన పార్టీ నేతలు
- మాజీ మంత్రి జగదీష్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాట్లు
- జనసమీకరణకు రంగంలోకి దిగిన మాజీ ఎమ్మెల్యేలు
- సభ ద్వారా పార్టీ భవిష్యత్ కార్యాచరణ వెల్లడిస్తారని అంచనా

బీఆర్ఎస్ రజతోత్సవ సభకు పార్టీ శ్రేణులు సిద్ధమయ్యాయి. హన్మకొండ జిల్లా ఎల్కతుర్తి లో ఆదివారం జరిగే ఈ సభకు ఉమ్మడి నల్లగొండ జిల్లా నుంచి లక్ష మంది వరకు తరలివెళ్లేందుకు పార్టీ నేతలు ఏర్పాట్లు చేశారు. సభ అనంతరం పార్టీ సంస్థాగత పదవులు భర్తీచేసే అవకాశం ఉండటంతో ఆశావహులంతా పెద్ద సంఖ్యలో జనసమీకరణ చేస్తున్నారు.

- (ఆంధ్రజ్యోతి ప్రతినిధి, నల్లగొండ)

రజతోత్సవ సభను విజయవంతం చేసేందుకు మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్‌రెడ్డి నేతృత్వంలో మాజీ ఎంపీలు, మాజీ ఎమ్మెల్యేలు, పార్టీ నేతలంతా ఇప్పటికే గ్రామస్థాయి మొదలు నియోజకవర్గ స్థాయి వరకు సన్నాహక సమావేశాలు పూర్తిచేశారు. రజతోత్సవసభ పూర్తయ్యాక పార్టీని గ్రామస్థాయి నుంచి జిల్లా స్థాయి, రాష్ట్ర కార్యవర్గంవరకు సంస్థాగతంగా కమిటీలు ఏర్పాటు చేయాలని ఇప్పటికే నిర్ణయించారు. దీంతో ఈ సభను విజయవంతం చేయడం ద్వారా పార్టీలో తమ స్థానాన్ని పదిలపరచుకోవాలని, అధిష్ఠానం దృష్టి లో పడడం ద్వారా పార్టీ పదవు లు దక్కించుకోవాలని క్యాడర్ సన్నద్ధమవుతోంది.ఆదివారం ఉదయం నుంచే రజతోత్సవ సభకు వెళ్లేందుకు వీలుగా ఇప్పటికే వాహనాలను బుక్ చేసుకోగా, శనివారం మధ్యా హ్నం నుంచే ఉమ్మడి జిల్లాలో బీఆర్ఎస్ రజతోత్సవ సందడి మొదలైంది.

ఉమ్మడి జిల్లా నుంచి లక్ష మంది..

బీఆర్ఎస్ రజతోత్సవ సభకు ఉమ్మడి నల్లగొండ జిల్లా నుంచి సుమారు లక్షమంది తరలివెళ్లేలా పార్టీనేతలు సన్నాహాలు చేశారు. ప్రధానంగా సూర్యాపేట, తుంగతుర్తి, ఆలేరు, భువనగిరి నియోజకవర్గాల నుంచి 50వేల మంది వెళ్లేలా ఏర్పాట్లు చేయగా, మిగిలిన నియోజకవర్గాల నుం చి మరో 50వేల మంది సభకు వెళ్లేందుకు వీలుగా వాహనాలు ఏర్పాటు చేస్తున్నారు. ఆర్టీసీ బస్సులు, ప్రైవేట్ బస్సులతో పాటు కార్లను ఇప్పటికే అందుకు బుకింగ్ చేశా రు. ఉదయాన్నే బయలుదేరి వెళ్లేలా, మార్గమధ్యలోనే మ ధ్యాహ్న భోజనాలు చేసేలా ఏర్పాట్లు చేసినట్లు పార్టీ నా యకులు తెలిపారు. ప్రధానంగా యువత, మహిళలు పెద్దసంఖ్యలో సభకు వెళ్లేందుకు ఆసక్తి చూపుతున్నారని బీఆర్ఎస్ నేతలు చెబుతున్నారు. మాజీ మంత్రి జగదీష్‌రెడ్డితో పాటు మాజీ ఎంపీ, మాజీ ఎమ్మెల్యేలు నియోజకవర్గాల వారీగా సభకు వెళ్లే ఏర్పాట్లను పరిశీలిస్తున్నారు. ప్ర ధానంగా రవాణాపరంగా ఇబ్బందులు లేకుండా చూడాల ని, ముందుగా నిర్ణయించుకున్న మార్గాల్లోనే వాహనాలు వెళ్లాలని ఇన్‌చార్జీలకు స్పష్టంగా సమాచారం ఇచ్చారు.

గుర్తింపునకు అవకాశంగా భావిస్తున్న క్యాడర్

పార్టీ ఏర్పాటై 25 ఏళ్లు పూర్తవుతున్న సందర్భంగా ఏర్పాటు చేస్తున్న రజతోత్సవ సభను విజయవంతం చేయడంలో తమ కృషిని చాటుకోవడం ద్వారా పార్టీ అధిష్ఠానం దృష్టిలో పడేలా నాయకులు పనిచేస్తున్నారు. సభ కు వాహనాలు, జనసమీకరణ బాధ్యతలను...

- మిగతా 7వ పేజీలో...

జిల్లా నుంచి 40వేల మంది తరలింపు

బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు రవీంద్రకుమార్



దేవరకొండ, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): వరంగల్‌లో ఈనెల 27న నిర్వహించనున్న బీఆర్ఎస్ రజతోత్సవ సభకు జిల్లా నుంచి 40వేల మందికిపైగా నాయకులు, కార్యకర్తలు హాజరుకానున్నట్లు బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ తెలిపారు. శనివారం దేవరకొండలో విలేకరులతో మాట్లాడుతూ, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ హాజరయ్యే రజతోత్సవ సభకు కనీవినీ ఎరగని రీతిలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు తరలివెళ్లనున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయలేదన్నారు. దీంతో ప్రభుత్వంపై వ్యతిరేకత మొదలైందన్నారు. ఎన్నికలు ఎప్పుడు వచ్చిన కేసీఆర్ నాయకత్వంలో బీఆర్ఎస్ విజయం సాధిస్తుందన్నారు. దేవరకొండ నియోజకవర్గం నుంచి వరంగల్ రజతోత్సవ సభకు 5వేల మందిని తరలిస్తున్నట్లు తెలిపారు.



రేషన్ కార్డులు వస్తున్నాయ్!

పేదలు ఏళ్లుగా ఎదురుచూస్తున్న రేషన్‌కార్డుల మంజూరు ప్రక్రియను ప్రభుత్వం ప్రారంభించింది. అందులో భాగంగా ఆహారభద్రతా కార్డుల మంజూరు పత్రాలను జారీచేస్తోంది. ఆ తరువాత కార్డులను ముద్రించి ఇచ్చేందుకు సన్నాహాలు చేస్తోంది. యాదాద్రి జిల్లాలో 419 కుటుంబాలకు నూతన ఆహారభద్రతా కార్డుల మంజూరు పత్రాలను జారీ చేసింది. సూర్యాపేట జిల్లాలో సుమారు 1050 కిపైగా మంజూరు పత్రాలను జారీ చేసింది.

- (ఆంధ్రజ్యోతి,యాదాద్రి)

- యాదాద్రి జిల్లాలో కొత్తగా 419 కుటుంబాలకు ఆహారభద్రతా కార్డుల మంజూరు పత్రాలు
- పేట జిల్లాలో 1050కి పైగా
- పదేళ్ల తరువాత మంజూరు
- ఈ ప్రభుత్వ హయాంలోనైనా కార్డులు ముద్రించి ఇచ్చేనా?

ఉమ్మడి రాష్ట్రంలో స్థానికత గుర్తింపుతో పాటు పలు ధ్రువీకరణ పత్రాలను రేషన్‌కార్డు ఆధారంగా జారీచేసేవారు. ప్రస్తుతం ఆధార్‌కార్డు మాదిరిగానే ఉమ్మడి రాష్ట్రంలో జారీచేసిన తెల్ల రేషన్‌కార్డులు బహుళ ప్ర యోజనాలకు (మల్టీప ర్పస్) ఉపయోగపడేవి. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఈ కార్డులు కేవలం నిత్యావసర సరుకుల పంపిణీకి మాత్రమే పరిమితమైంది. గత ప్రభుత్వం రేషన్‌కార్డులను రద్దు చేసి,వాటి స్థానంలో ఆహారభద్రతా కార్డులను పంపిణీ చేయాలని నిర్ణయించినా, అవి జారీ కాలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడగానే అర్హులకు రేషన్ కార్డులు పంపిణీ చేస్తామని హామీ ఇచ్చింది. అందులో భాగంగా ఆరు గ్యారెంటీలకు దరఖాస్తులు తీసుకునే సమయంలో ప్రజల నుంచి రేషన్‌కార్డుల కోసం దరఖాస్తులు కూడా తీసుకుంది. ఒక్క యాదాద్రి జిల్లాలో పలు పథకాల కింద 2లక్షలకుపైగా దరఖాస్తులు వచ్చాయి. అందులో రేషన్ కార్డుల కోసం సుమారు 25వేలకు పైగా దరఖాస్తులు ఉన్నాయి. అయితే వీటిని పరిశీలించి, గ్రామాల్లో అధికారులు విచారించిన తర్వాత అర్హులైన వారికి రేషన్‌కార్డులు జారీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు అధికారులు విచారణ చేపట్టి లబ్ధిదారుల జాబితాను రూపొందించి ప్రభుత్వానికి నివేదించారు. ప్రస్తుతం యాదాద్రి జిల్లాలో కొత్తగా 419 కుటుంబాల కు ఆహారభద్రతా కార్డులు మంజూరు పత్రాలు జారీ చేసింది. సూర్యాపేట జిల్లాలో 1050కి పైగా మంజూరయ్యాయి. అదేవిధంగా 10వేలకు పైగా దరఖాస్తులు గతంలో ఉన్న రేషన్‌కార్డుల్లో నూతన కుటుంబ సభ్యు ల పేర్ల నమోదుకు వచ్చాయి. వాటిని సైతం అధికారు లు విచారించి పేర్లు నమోదు చేస్తున్నారు. నూతన కార్డుదారులకు మే నెల నుంచి సన్న బియ్యం పంపిణీ చేసేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు.

యాదాద్రి జిల్లాలో 2,17,323 కార్డులు

ఉమ్మడి జిల్లాలో 2015 నుంచి ఈ- పాస్ విధానం ద్వారా బియ్యం పంపిణీ చేస్తున్నారు. కొవిడ్-19 సమయం నుంచి ఆహారభద్రతా కార్డుదారులకు ప్రతీ సభ్యుడి కి 6కిలోల చొప్పున ఉచితంగా బియ్యాన్ని పం పిణీ చేస్తున్నారు. యాదాద్రి జిల్లాలో మొత్తం 2,16,841 ఆహారభద్రతా కార్డులు ఉండగా, వీటి లో 13,734 అంత్యోదయ కార్డులు ఉన్నాయి. జిల్లా లో మొత్తం 515 చౌకధరల దుకాణాలు ఉన్నాయి..

- మిగతా 7వ పేజీలో...

పదేళ్ల తరువాత...

ప్రభుత్వం ఆహారభద్రతా కార్డుల కింద కుటుంబంలోని మూడేళ్ల వయసు దాటిన వారందరికీ ఆరుకిలలో చొప్పున ఉచితంగా బియ్యాన్ని పంపిణీ చేస్తోంది. గత ప్రభుత్వం ఆహారభద్రత కార్డులుగా పేరు మార్చినప్పటికీ, ఇప్పటివరకు ఎలాంటి కార్డులు లబ్ధిదారులకు పంపిణీ చేయలేదు. త్వరలోనే కొత్త కార్డులను పంపిణీ చేస్తామని గత ప్రభుత్వం ప్రకటించినా, 2,16,904 రేషన్‌కార్డుదారులు ఇప్పటివరకు కాగితాలను జిరాక్స్ చేయించుకుని బియ్యం, ఇతర సరుకులు తీసుకుంటున్నారు. గత సర్కారు కార్డు జారీ ప్రక్రియను వాయిదాలతోనే సరిపెట్టింది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ఈ ప్రభుత్వంలోనైనా కార్డులు ముద్రిస్తారని లబ్ధిదారులు ఆశిస్తున్నారు. ప్రభుత్వం ప్రతినెలా లబ్ధిదారులకు బియ్యం అందిస్తున్నప్పటికీ, కార్డుల జారీలో జాప్యం జరుగుతోంది. గతంలో డిజిటల్ కార్డులను పంపిణీ చేయాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. అయితే కార్డుల జారీపై ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. ఈ ప్రభుత్వంలోనైనా కొత్తగా ఆహారభద్రతా కార్డులు అందుతాయనే ఆశతో ప్రజలు ఉన్నారు.

మిస్‌వరల్డ్ పోటీదారులకు అసౌకర్యాలు కలగకుండా చూడాలి

రాష్ట్ర ఆర్ట్స్ గ్యాలరీ డైరెక్టర్, ఐఏఎస్ అధికారి లక్ష్మి



బుద్ధవనం వద్ద కలెక్టర్‌తో మాట్లాడుతున్న రాష్ట్ర ఆర్ట్స్ గ్యాలరీ డైరెక్టర్ లక్ష్మి

నాగార్జునసాగర్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): మిస్‌వరల్డ్ పోటీదారులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా చూడాలని రాష్ట్ర ఆర్ట్స్ గ్యాలరీ డైరెక్టర్, ఐఏఎస్ అధికారి లక్ష్మి అన్నారు. శనివారం కలెక్టర్ ఇలా త్రిపాఠి, మిర్యాలగూడ సబ్ కలెక్టర్ అమిత్‌నారాయణతో కలిసి బుద్ధవనం, విజయవిహార్‌ను ఆమె పరిశీలించారు. బుద్ధవనం సమావేశ మందిరంలో అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆమె మాట్లాడారు. హైదరాబాద్‌లో మే 7 నుంచి 31వ తేదీ వరకు మిస్‌వరల్డ్ పోటీలకు హాజరవుతున్న అతిథులు మే 12న బుద్ధ పూర్ణిమ సందర్భంగా సాగర్‌కు వస్తున్నారన్నారు. 15 రోజుల సమయం మాత్రమే మిగిలి ఉన్నందున త్వరితగతిన పనులు పూర్తిచేయాలని ఆదేశించారు. సివిల్ పనులను మే 3వ తేదీ నాటికి పూర్తిచేయలన్నారు. బుద్ధవనం, విజయవిహార్ పరిసరాల్లో రోడ్డుకు ఇరువైపులా లైటింగ్ ఏర్పాటుచేయాలని, పారిశుధ్య పనులు నిర్వహించాలని సూచించారు. కలెక్టర్ ఇలా త్రిపాఠి మిస్‌వరల్డ్ పోటీదారులు మే 12వ మధ్యాహ్నం 1గంటకు హైదరాబాద్ నుంచి బయల్దేరి సాయంత్రం 4.30కు సాగర్ విజయవిహార్‌కు చేరుకుంటారన్నారు. ఇక్కడ వారు సేదతీరి సాయంత్రం బుద్ధవనాన్ని సందర్శిస్తారని చెప్పారు. బుద్ధవనంలోని మహాస్తూపం లోపల ధ్యానం చేస్తారని, ఆతరువాత జాతకవనం, స్తూపవనం, చరితవనాలను తిలకించి తిరిగి రాత్రి 7.45 గంటలకు హైదరాబాద్‌కు బయల్దేరుతారని వివరించారు. సమావేశంలో సబ్‌కలెక్టర్ అమిత్‌నారాయణ, బుద్ధవనం ఓఎస్డీ సుధన్‌రెడ్డి, పర్యాటక శాఖ ఎస్‌ఈ భాస్కర్‌రావు, సాగర్ సీఐ శ్రీనునాయక్, తదితరులు పాల్గొన్నారు.

మహనీయుల ఆశయసాధనకు జనజాతర

కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగార్జున



సమావేశంలో మాట్లాడుతున్న పాలడుగు నాగార్జున

నల్లగొండ రూరల్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): మహనీయుల ఆశయ సాధనకు జనజాతర నిర్వహిస్తున్నట్లు కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి పాలడుగు నాగార్జున అన్నారు. స్థానిక దొడ్డికొమరయ్య భవనంలో శనివారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అంటరానితనం, కుల వివక్ష, సామాజిక దోపిడిపై అక్షర యుద్ధం చేసిన యోధులు జ్యోతిబాపూలే, అంబేడ్కర్ అని అన్నారు. వారి స్ఫూర్తితో ఆత్మగౌరవం, సమానత్వం, కుల నిర్మూలనకు పోరాడాలని పిలుపునిచ్చారు. ఈనెల 28న సాయంత్రం 5గంటలకు నల్లగొండ గడియారం సెంటర్‌లో నిర్వహించే జనజాతరలో పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కళాకారుల సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. జనజాతరకు ఉస్మానియా యూనివర్సిటీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కాశీం, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి, ఏపూరి సోమన్న, స్కైలాబ్ బాబు, విద్యావంతుల అంబటి నాగయ్య, తదితరులు హాజరవుతారని తెలిపారు. సమావేశంలో కేవీపీఎస్ రాష్ట్ర కమిటీ సభ్యుడు బొట్టు శివకుమార్, జిల్లా ఉపాధ్యక్షుడు గాదె నరసింహ, సహాయ కార్యదర్శి బొల్లు రవీందర్‌కుమార్, జిల్లా కమిటీ సభ్యులు సైదులు, తదితరులు పాల్గొన్నారు.

భూముల పరిరక్షణకే 'భూభారతి' : కలెక్టర్

గుర్రంపోడు, పెద్దఅడిశర్లపల్లి, గుడిపల్లి, కనగల్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): భూముల పరిరక్షణకే భూభారతి చట్టాన్ని ప్రభుత్వం తీసుకువచ్చిందని కలెక్టర్ ఇలా త్రిపాఠి, నాగార్జునసాగర్ ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డి అన్నారు. శనివారం గుర్రంపోడు, పీఏపల్లి, గుడిపల్లి, కనగల్ మండల కేంద్రాల్లో ఏర్పాటుచేసిన భూభారతి అవగాహన సదస్సుల్లో కలెక్టర్ మాట్లాడారు. ధరణిలో దొర్లిన తప్పులను భూభారతి ద్వారా సరి చేసుకోవచ్చన్నారు. రికార్డుల సవరణతో పాటు, రికార్డుల నిర్వహణ, భద్రపరచడం, ఏటా రికార్డులను ప్రదర్శించే వెసులుబాటు భూభారతిలో ఉందన్నారు. రైతులు ఈ చట్టాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. మండల వ్యాప్తంగా ఉన్న వారసత్వ, వివిధ రకాల భూముల సమస్యలను త్వరలో పరిష్కరిస్తామన్నారు. అధికారులు భూముల సర్వేకు వచ్చినప్పుడు రైతులు అందుబాటులో ఉండి సమాచారం ఇవ్వాలన్నారు. ఇందిరమ్మ ఇళ్ల జాబితా పరిశీలన కోసం ప్రతీ 200 మంది లబ్ధిదారులకు ఒక గెజిటెడ్ అధికారిని నియమించామన్నారు. వారు పారదర్శకంగా విచారణ నిర్వహించి లబ్ధిదారులను ఎంపిక చేస్తారన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి అదనపు కలెక్టర్, మిర్యాలగూడ సబ్‌కలెక్టర్ నారాయణ్ అమిత్, దేవరకొండ ఏఎస్పీ మౌనిక, ఆర్డీవో రమణారెడ్డి, జిల్లా సహకార అధికారి పత్యానాయక్, తహసీల్దార్లు పరీదుద్దీన్, శ్రీనివాస్‌రావు, మధుహాసిని, పద్మ, ఎంపీడీవోలు మంజుల, నల్లగొండ ఏఎంసీ చైర్మన్ రమేష్, మాజీ చైర్మన్ భిక్షం, నర్సింగ్ శ్రీనివాస్‌గౌడ్, గడ్డం అనూప్‌రెడ్డి, చీదేటి వెంకట్‌రెడ్డి, రాజారెడ్డి, గోలి జగాల్‌రెడ్డి, నర్సింగ్ కృష్ణయ్యగౌడ్, హఫీజుద్దీన్, బోగరి రాంబాంబు, వెంకటేశ్వర్‌రావ్, పెంటయ్య, ఇతర అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



గుడిపల్లిలో అవగాహన సదస్సులో మాట్లాడుతున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

ధాన్యం దిగుమతులను వేగవంతం చేయాలి

(ఆంధ్రజ్యోతి, హాలియా): మిల్లర్లు ధాన్యం దిగుమతులను వేగవంతం చేయాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి సూచించారు. శనివారం సాయంత్రం నాగార్జునసాగర్‌కు వెళ్లి వస్తూ మార్గమధ్యలో ఉన్న అనుముల మండలం కొత్తపల్లిలోని బాలాజీ రైస్ ఇండస్ట్రీస్‌ను సబ్‌కలెక్టర్, ఇన్‌చార్జ్ అదనపు కలెక్టర్ అమిత్ నారాయణతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, వేగంగా ధాన్యం దిగుమతి చేసేందుకు అవసరమైన హమాలీలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. అదేవిధంగా మిల్లర్లు ధాన్యం దిగుమతులకు సంబంధించిన రిజిస్టర్లను నిర్వహించాలన్నారు. వెంటనే ట్రక్‌షీట్‌లను ఐకేపీ, పీఏసీఎస్‌కు అందజేయాలన్నారు. రైతులు కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకొని ప్రభుత్వం అందిస్తున్న మద్దతు ధర పొందాలన్నారు. ఆమె వెంట డీసీఎస్‌వో వెంకటేష్, డీఎం హరీష్, జిల్లా మిల్లర్స్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు చిట్టిపోలు యాదగిరి, బాలాజీ రైస్ ఇండస్ట్రీస్ మేనేజింగ్ పార్ట్‌నర్ చిట్టిపోలు కరుణాసాగర్, ప్రసాద్, పవన్, ఉన్నారు.

అభివృద్ధిలో పాల్గొంటున్న కాంట్రాక్టర్లను రక్షించాలి

బిల్డర్స్ అసోసియేషన్ జాతీయ ఉపాధ్యక్షుడు డీవీఎన్.రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న బిల్డర్స్ అసోసియేషన్ జాతీయ ఉపాధ్యక్షుడు డీవీఎన్.రెడ్డి

నల్లగొండ టౌన్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ అభివృద్ధిలో పాల్గొంటున్న కాంట్రాక్టర్లను రక్షించాలని బిల్డర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా జాతీయ ఉపాధ్యక్షుడు డీవీఎన్.రెడ్డి అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన బిల్డర్స్ అసోసియేషన్ జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం కాంట్రాక్టర్ల సమస్యలపై చర్చించాలని, బిల్లులు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఉమ్మడి జిల్లాకు చెందిన మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి జిల్లా అభివృద్ధికి పనులు నిర్వహిస్తున్న కాంట్రాక్టర్లను రక్షించాలన్నారు. ఆర్‌అండ్‌బీకి రూ.100కోట్లు ఇస్తే 200 బిల్లులు క్లియర్ అవుతాయన్నారు. రోడ్ల మరమ్మతుల బిల్లుల రూ.5వేల నుంచి రూ.20లక్షల వరకు ఉన్నాయని, వాటిని వెంటనే ఇప్పించాలన్నారు. చిన్న కాంట్రాక్టర్లకు బిల్లు చెల్లించి తోడ్పాటు అందించాలన్నారు. కాంట్రాక్టర్లతో సమావేశం నిర్వహించి ఎంత డబ్బు చెల్లిస్తారో, ఏ పనులు నిర్వహించాలో చెబితే ప్రభుత్వానికి అండగా ఉంటారన్నారు. రాష్ట్రంలో కాంట్రాక్టర్లు ప్రత్యక్షంగా, పరోక్షంగా మూడు లక్షల మందికి ఉపాధి కల్పిస్తున్నారని, వారిని రక్షించుకోవాల్సిన అవసరం ప్రభుత్వానికి ఉందన్నారు. అనంతరం డీవీఎన్.రెడ్డిని జిల్లా సభ్యులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఫౌండర్ చైర్మన్ కృష్ణారావు, సీడీఐ చైర్మన్ భాస్కర్‌రెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, కోశాధికారి సంతోష్‌రెడ్డి, జిల్లా చైర్మన్ భాస్కర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి, కార్యదర్శి రంగారావు, సత్యనారాయణ, మెదక్ జిల్లా బాధ్యులు సత్యమయ్య, కోకాపేట వినయ్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

భక్తజనసంద్రం యాదగిరిక్షేత్రం

- స్వామివారిని దర్శించుకున్న 40వేల మందికిపైగా భక్తులు
- స్వామివారికి శాస్త్రోక్తంగా నిత్య పూజా కైంకర్యాలు

• 6లో..



అనుమతి లేకుండా కాల్వ గేట్లు ఎత్తితే చర్యలు

నార్కట్‌పల్లి, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): బీ.వెల్లెంల ఉదయ సముద్రం ఎత్తిపోతల రిజర్వాయర్ కుడి, ఎడమ కాల్వల గేట్లను ఎవరైనా అనుమతి లేకుండా ఎత్తితే చట్టపర చర్యలు తీసుకుంటామని ప్రాజెక్టు డీఈఈ పిచ్చయ్య, ఏఈఈ నవీన్‌లు ఒక ప్రకటనలో హెచ్చరించారు. ప్రాజెక్టు రిజర్వాయర్ పూర్తిస్థాయి నీటిమట్టం 0.302 టీఎంసీలు కాగా, ప్రస్తుతం రిజర్వాయర్‌లో 0.212 టీఎంసీల నీరు నిల్వ ఉందని తెలిపారు. వేసవి దృష్ట్యా గ్రామాల్లో బోర్లు ఎండిపోకుండా ఉండేందుకు, భూగర్భ జలాలు పెంపొందించే ఉద్దేశంతో కాల్వలకు నీటి విడుదల నిలిపామన్నారు. ఎవరైనా అనుమతి లేకుండా రిజర్వాయర్ కాల్వల గేట్లు, డీపీల గేట్లు ఎత్తితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



బీ.వెల్లెంల ఎత్తిపోతల ఎడమకాల్వ గేటు



రామంజి కుటుంబానికి ఆర్థిక సాయం

డిండి, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన ఎదురు రామంజి అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందాడు. దీంతో గ్రామ చేయూత సభ్యులు మృతుడి భార్య వెంకటమ్మకు రూ.10వేలు అందజేశారు. చేయూత సభ్యులు 22 మంది గ్రామంలో సేకరించి సాయం అందించారు. బొల్లె శైలేజ్, బాదమోని శ్రీనివాస్‌గౌడ్, ఆమనగంటి కృష్ణ, నరేష్, అంజి, గోవర్ధన్, పున్న దినేష్, శ్రీశైలం, గౌస్ పాల్గొన్నారు.

రజతోత్సవ సభను విజయవంతం చేయాలి

చింతపల్లి, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): వరంగల్ జిల్లా ఎల్కతుర్తిలో ఆదివారం నిర్వహించే భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు కంకణాల వెంకట్ రెడ్డి పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ శ్రేణులు అధికసంఖ్యలో తరలిరావాలని కోరారు. మాజీ సీఎం కేసీఆర్ హాజరుకానున్నట్లు పేర్కొన్నారు. బీఆర్ఎస్‌తోనే అన్ని వర్గాలకు న్యాయం జరుగుతుందన్నారు.

పశువులను జాగ్రత్తగా కాపాడుకోవాలి

● డాక్టర్ అశోక్‌కుమార్, పశువైద్యాధికారి, వేములపల్లి



ఇంటర్వ్యూ Interview

రోజురోజుకు పెరుగుతున్న వేసవి దృష్ట్యా పశువులను జాగ్రత్తగా కాపాడుకోవాలని వేములపల్లి పశువైద్యాధికారి అశోక్‌కుమార్ సూచించారు. లేనిపక్షంలో పశువుల్లో పాల దిగుబడి తగ్గడంతో పాటు వడదెబ్బకు గురై మృత్యువాత పడే ప్రమాదం ఉందని శనివారం 'ఆంధ్రజ్యోతి' కి ఇచ్చిన ఇంటర్వ్యూలో తెలిపారు.

(ఆంధ్రజ్యోతి- వేములపల్లి)

ఆంధ్రజ్యోతి : మండలంలో పశుసంపదఎంత ఉంది.

పశువైద్యాధికారి : మండలంలో 1,107 పశువులు ఉండగా 8,326 గేదెలు ఉన్నాయి. 23,066 గొర్రెలు, 2064 మేకలు, 29,740 కోళ్ల ఉన్నాయి

ఆంధ్రజ్యోతి : వేసవిలో పాల దిగుబడి తగ్గకుండా ఉండేందుకు రైతులు ఏం చర్యలు చేపట్టాలి?

పశువైద్యాధికారి : వేసవిలో పశువుల్లో పాల దిగుబడి తగ్గేందుకు అస్కారం ఉంటుంది. దాన్ని నివారించుకునేందుకు పశువుల పాకలపై గడ్డి, గోనెసంచులు వేసి అప్పుడప్పుడు నీటిని చలుకోవాలి. సాయంత్రం నీళ్లతో వాటిని శుభ్రంగా స్నానం చేయించి మేతను సకాలంలో వేస్తుండాలి.

ఆంధ్రజ్యోతి :వడదెబ్బకు గురికాకుండా ఏ విధమైన చర్యలు తీసుకోవాలి?

పశువైద్యాధికారి : పశువులను ఉదయం, సాయంత్రం వేళల్లో ఎండతీవ్రత తక్కువగా ఉన్న సమయంలో మేతకు తోలుకోని వెళ్లాలి. పశువులు తాగే నీరు శుభ్రంగా, స్వచ్ఛంగా ఉండేలా చూసుకోవాలి. నీడ ఉన్న ప్రాంతంలో నిల్వ ఉంచిన చల్లటి నీరు మాత్రమే పశువులు తాగేలా జాగ్రత్తలు పాటిస్తే వడదెబ్బకు గురికాకుండా చూసుకోవచ్చు.

ఆంధ్రజ్యోతి : వడదెబ్బకు గురైతే ఏ విధమైన ప్రాథమిక చికిత్సను అందించాలి?

పశువైద్యాధికారి: పశువులు వడదెబ్బకు గురై నీరసిస్తే వెంటనే చల్లని గాలి వచ్చే ప్రదేశంలోకి తీసుకెళ్లి శరీర ఉష్ణోగ్రత తగ్గడానికి నీటితో తడిపిన గోనెసంచులను వాటిపై కప్పి ఉంచి పశు వైద్యాధికారిని సంప్రదించాలి.

ఓపెన్ జైలు పనులు ప్రారంభమెప్పుడో ?

» నేరేడుగొమ్ములో ఏళ్లు గడుస్తున్నా స్థల సేకరణకే పరిమితం



నేరేడుగొమ్ము మండలం పెద్దమునిగల్ వద్ద ఓపెన్ ఎయిర్ జైలు నిర్మాణానికి స్థల సేకరణ చేస్తున్న అధికారులు (ఫైల్)

(ఆంధ్రజ్యోతి-దేవరకొండ,): దేవరకొండ డివిజన్ పరిధిలోని ఓపెన్ ఎయిర్ జైలు నిర్మించాలని గత ప్రభుత్వ నిర్ణయించింది. ఇందుకు 2018 సంవత్సరంలో అప్పటి హోంశాఖమంత్రి నాయిని నర్సింహరెడ్డి సొంత మండలమైన నేరేడుగొమ్ము మండలం పెద్ద మునిగల్‌లో ఓపెన్ ఎయిర్ జైలు నిర్మించాలని నిర్ణయం తీసుకు న్నారు. జైలు కోసం స్థలాన్ని కూడా సేకరించారు. గ్రామ సర్వే నంబర్ 299లో 350 ఎకరాల్లో రెవెన్యూ, జైళ్లశాఖ ఆధ్వర్యంలో సర్వే చేశారు. జైలు నిర్మాణానికి 289 ఎకరాలను జైళ్లశాఖకు కేటాయిస్తూ అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. కానీ సర్వేకే పరిమితమైంది. అప్పటి హోంశాఖ మంత్రి నాయిని నర్సింహరెడ్డి మృతి చెందడంతో ఓపెన్ ఎయిర్ జైలు ప్రస్తావన నిలిచి పోయింది. అంతేకాకుండా నేరేడుగొమ్ము మండలంలో ప్రభుత్వ స్థలాల్లో ఓపెన్ ఎయిర్ జైలు, ఏకో టూరిజం ఏర్పాటు చేయాలని అప్పటి హోంశాఖమంత్రి నాయిని నర్సింహరెడ్డి నిర్ణయం తీసుకున్నారు. ఓపెన్ ఎయిర్ జైలుతోపాటు ఏకోటూరిజం ఏర్పాటు చేస్తే మండలంలో ఉపాధి అవకాశాలు కలుగుతాయని భావించారు. వ్యవసాయ క్షేత్రాన్ని అభివృద్ధి చేసి వన మూలికలు, కూరగాయలు, పండ్లతోటలు పెంచాలని అందుకు తగినట్లుగా సాగర్ బ్యాక్ వాటర్ అందుబాటులో ఉంటుందని భావించారు. ఏకోటూరిజం 30శాతం పనులు జరిగి నిలిచిపోయింది. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం గత ప్రభుత్వం ప్రతిపాదించిన ఓపెన్ ఎయిర్ జైలు, ఏకోటూరిజం ఏర్పాటు చేస్తుందని ఆశాభావాన్నిస్థానికులు వ్యక్తం చేస్తున్నారు. కృష్ణా పరీవాహక ప్రాంతం కావడం, పర్యాటకుల రద్దీ అధిక మైంది. ఏకోటూరిజం పనులు పూర్తి చేస్తే పర్యాటకులకు మరింత సౌకర్యంగా ఉంటుంది. ఈ విషయమై దేవరకొండ ఆర్డీవో రమణారెడ్డిని ఆంధ్రజ్యోతి వివరణ కోరగా నేరేడుగొమ్ము మండలంలో సర్వేనెంబర్ 289లో ప్రభుత్వ భూమిని ఏకోటూరిజానికి కేటాయించిందన్నారు.

సమాచారం

'భూభారతి'పై నేడు అవగాహన

నిడమనూరు, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా తీసుకొచ్చిన భూభారతి చట్టంపై మండల కేంద్రంలో ఆదివారం అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ జంగాల కృష్ణయ్య, ఏవో మునికృష్ణయ్య తెలిపారు. తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో ఆదివారం ఉదయం 7.30 గంటలకు నిర్వహించనున్న సదస్సులో కలెక్టర్ ఇలా త్రిపాఠి ఎంపీ, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు పాల్గొంటారని పేర్కొన్నారు.

● త్రిపురారం : మండల కేంద్రంలోని అనుముల సుశీల నరసింహారెడ్డి ఫంక్షన్ హాల్‌లో ఆదివారం నిర్వహించనున్న భూభారతి అవ గాహన సదస్సును విజయవంతం చేయా లని తహసీల్దార్ గాజుల ప్రమీల కోరారు. శనివారం మండల తహసీల్దార్ కార్యాల యంలో నిర్వహించిన సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. భూభారతిపై ప్రజలకు, రైతులకు అవగాహన కల్పిం చేం దుకు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ శ్రీదేవి, ఆర్ఐలు సైదులు, సంతోష, కల్పన, రేణుక, లక్ష్మీ, రమేష్ పాల్గొన్నారు.

ముష్కరులను తుదముట్టించాలి

మిర్యాలగూడ, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): కశ్మీరు పహల్గాంలో అమాయక ప్రజలను కాల్చి చంపిన ఉగ్ర ముష్కరులను తుదముట్టించాలని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. ఉగ్రదాడిలో ప్రాణాలు కోల్పోయిన వారి ఆత్మశాంతి కోసం శనివారం సాయంత్రం పట్టణంలో నల్ల కండువాతో నిర్వహించిన కొవ్వొత్తుల ర్యాలీలో సబ్‌కలెక్టర్ నారాయణ అమిత్, డీఎస్పీ రాజశేఖర్‌రాజు కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేల మాట్లాడుతూ అమాయక ప్రజలను కాల్చిచంపిన దుండగులను కఠినంగా శిక్షించాలని కోరారు. ఉగ్రచర్యలతో దేశంలో తీవ్రవాద సంస్థలు విధ్వంసానికి పాల్పడకుండా నిఘా వ్యవస్థను పటిష్ఠ పరిచి ఉగ్రవాద చర్యలను అరికట్టాలని అన్నారు. ఉగ్రవాద చర్యలతో మత హింసను ప్రేరేపిస్తే సంహించరాదని, అన్ని వర్గాల ప్రజలు హింసావాదాన్ని వ్యతిరేకించి 'హమ్ ఏక్ హై' అని చాటాలన్నారు. ఇలాంటి చర్యలకు సహనం కోల్పోకుండా సమైఖ్యజీవనంతో శాంతి సౌభ్రాతృత్వాన్ని కొనసాగించడమే అమరులకు మనం ఇచ్చే అసలైన నివాళి అని అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు నూకల వేణుగోపాల్‌రెడ్డి, స్కైలాబ్ నాయక్, చిలుకూరి బాలు, పొదిల శ్రీనివాస్, దేశిరెడ్డి శేఖర్‌రెడ్డి, తహసీల్దార్ హరిబాబు, జాని, సలీం, ఇమ్రాన్, అనుముల మధుసూదన్‌రెడ్డి, కాంతయ్య, రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ నాయకులు కర్నాటి రమేష్, నాగునాయక్, కళాశాలల విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

● హాలియా : దేశంలో ఉగ్రవాదం ఏరూపంలో ఉన్న తుదముట్టించాలని దామరచర్ల మండల విద్యాధికారి బాలాజీనాయక్ అన్నారు. శనివారం జమ్మూకశ్మీర్ పహల్గాంలో జరిగిన ఉగ్రదాడిని ఖండిస్తూ ప్రాణాలు కోల్పోయిన అమరులకు బహుజన ఉపాధ్యాయుల వేదిక అధ్వర్యంలో కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాక్ ప్రేరేపిత ఉగ్రవాదులు అమాయకులను చంపడం అత్యంత పాశవిక చర్య అన్నారు. ఈ ఘటనకు పాల్పడ్డ ఉగ్రవాదులను కఠినంగా శిక్షించాలన్నారు. బీసీ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు రాపోలు పరమేష్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ఉపాధ్యాయులు మాలి సైదులు, అంబటి వీరనారాయణ, స్కైలాబ్‌నాయక్, అంబటి శ్రీను, కఫూర్‌నాయక్, శ్రీనివాస్‌నాయుడు ఉన్నారు.



మిర్యాలగూడ పట్టణంలో కొవ్వొత్తుల ర్యాలీలో పాల్గొన్న ప్రజలు



హాలియాలో బహుజన ఉపాధ్యాయుల వేదిక ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో ర్యాలీ



అమరవీరుల స్తూపం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే బీఎల్ఆర్, సబ్‌కలెక్టర్ నారాయణ అమిత్

టీడీపీ డిజిటల్ సభ్యత్వం కార్డుల పంపిణీ



డిజిటల్ సభ్యత్వ కార్డులు అందజేస్తున్న అరుణ్‌కుమార్

గుర్రంపోడు, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): టీడీపీ సభ్యత్వ నమోదులో భాగంగా మండలంలోని పిట్టలగూడెం, తానేదారుపల్లి గ్రామాల్లో డిజిటల్ సభ్య త్వ కార్డులు ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి మువ్వా అరుణ్ కుమార్ శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీ పాలనలోనే ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ అభివృద్ధి చెందిందన్నారు. కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు షేక్ జమీల్, ఉడ్తూరి నర్సింహరెడ్డి, మంద తిరుపతయ్య, కంచర్ల వెంకన్న, కుంచకూరి శ్రీనివాస్, కర్నె రమణారెడ్డి, కట్ట యాదగిరి, ఎల్లేషం పాల్గొన్నారు.

మేడేను విజయవంతం చేయాలి



మిర్యాలగూడలో మాట్లాడుతున్న ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు సోమయ్య

మిర్యాలగూడ, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): కార్మికుల హక్కుల దినోత్సవం మే డే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు అంబటి సోమయ్య కోరారు. స్థానికంగా శనివారం నిర్వహించిన మేడే సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. బీజేపీ ప్రభుత్వం తెచ్చిన 4 లేబర్ కోడ్‌లకు రద్దు చేయాలన్నారు. ఎన్నో పోరాటాల ఫలితంగా కార్మికులు సాధించుకున్న హక్కులను కేంద్రం కాలరాస్తోందని అన్నారు. అన్ని రంగాల్లో అసంఘటితరంగ కార్మికులు ఐఎన్‌టీయూసీ జెండా కింద సంఘటితం కావాలన్నారు. కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ స్టేట్ కౌన్సిల్ సభ్యుడు నూకపంగ నాగయ్య, జిల్లా వైస్ పెసిడెంట్ పెరిక వెంకటేశ్వర్లు, పట్టణాధ్యక్షుడు చాంద్‌పాషా, కాంగ్రెస్ ప్రచార కమిటీ జిల్లా చైర్మన్ పోలగాని వెంకటేశ్‌గౌడ్, రాములు, రవి, జూలకంటి మల్లీశ్వరి పాల్గొన్నారు.



దామరచర్ల సమావేశంలో మాట్లాడుతున్న వినోద్‌నాయక్

● దామరచర్ల, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): ప్రపంచ కార్మిక దినోత్సవం మేడేను సీపీఎం మండల కన్వీనర్ వినోద్‌నాయక్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో మధ్యాహ్న భోజనం, మార్కెట్ హమాలీ వర్కర్స్‌తో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, కార్మి కులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేనట్లయితే కార్మికులు ఉద్యమిస్తారని హెచ్చరించారు. మేడేలో కార్మికులందరూ పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో దయానంద్, రాములయ్య, గోవిందరాజు, కార్మికులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వినియోగం తగ్గించాలి

పెద్దవూర, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని ఎస్ఐ వీరబాబు అన్నారు. శనివారం టైమ్ స్కూల్ ఆధ్వర్యంలో విద్యార్థులు మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్లాస్టిక్ వ్యర్థాలు పర్యావరణానికి హాని కలిగిస్తాయని, జీవవైవిద్యానికి ముప్పు కలిగిస్తాయని, మానవ ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం చూపిస్తాయన్నారు. ప్రతి ఒక్కరు ప్లాస్టిక్ వినియోగాన్ని క్రమంగా తగ్గిస్తూ పర్యావరణాన్ని కాపాడాలన్నారు. కార్యక్రమంలో మంద నరేందర్‌రెడ్డి, కత్తి కోటిరెడ్డి, వర్కాల శ్రీధర్‌రెడ్డి, గోవిందరెడ్డి, పడిగపాటి రమేష్‌రెడ్డి, చెన్ను మల్లేశ్వరి, సుజిత, అంజుమ్, విద్యార్థులు పాల్గొన్నారు.



ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాలని ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

దంచికొడుతున్న ఎండలు

● నిడమనూరులో ఇటీవల రికార్డు స్థాయిలో నమోదు ● బెంబేలెత్తుతున్న జనం



నిడమనూరులో నిర్మానుష్యంగా దర్శనమిస్తున్న రహదారులు

నిడమనూరు, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): నిడమనూరులో ఎండలు దంచి కొడుతున్నాయి. ఈ ఏడాది కూడా ఎండల్లో నిడమనూరు ప్రథమ స్థానంలో నిలుస్తోంది. రాష్ట్రంలోనే అత్యధిక ఉష్ణోగ్రతలు ఏటా ఇక్కడే నమోదవుతున్నాయి. ఈ ఏడాది కూడా ఇటీవల నిడమనూరులో రికార్డు స్థాయిలో 44.5 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదైంది. వాతావరణంలో మార్పులు రావడంతో ఒక్కసారిగా అనూహ్యంగా పెరిగిన పగటి ఉష్ణోగ్రతలు ప్రజలను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. గతేడాది మేలో నిడమనూరులో మునుపెన్నడూ లేని విధంగా రికార్డు స్థాయిలో 49.5 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. రోజురోజుకు ఎండల తీవ్రత పెరుగుతుండడంతో రోడ్లపై కర్ఫ్యూ వాతావరణం కనిపిస్తోంది. వ్యాపారాలు లేక దుకాణాలు వెలవెలబోతున్నాయి. ఇప్పుడే ఎండలు ఇలా దంచి కొడుతుంటే వచ్చే నెలలో రోహిణి కార్తెలో ఎండల తీవ్రత ఎలా ఉంటుందోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఉదయం 8 గంటల నుంచే భానుడు ప్రతాపం చూపిస్తుండడంతో జనం ఎండవేడిమి, ఉక్కపోతతో ఇబ్బంది పడుతున్నారు. ఎండల తీవ్రతకు ఉపాధి కూలీలు, వ్యవసాయ కూలీలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వృద్ధులు, పిల్లలు విలవిలలాడుతున్నారు. ఎండలకు తోడు కరెంటు కోతలు కూడా ప్రజలను ఇబ్బంది పెడుతున్నాయి. పగలు, రాత్రి అనే తేడా లేకుండా కరెంటు పోతుంది. ముందు ముందు ఉష్ణోగ్రతలు మరింతగా పెరిగే ప్రమాదం ఉన్నందున ప్రజలు జాగ్రత్తగా ఉండాలని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

పగలే వెలుగుతున్న విద్యుత్ దీపాలు



కొండ మల్లేపల్లిలో పగలే వెలుగుతున్న విద్యుత్ దీపాలు

కొండమల్లేపల్లి, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): ప్రస్తుత పరి స్థి తుల్లో విద్యుత్ ఎంత అవసరమో అందరికీ తెలిసిందే. గ్రామ, పట్టణాల్లో నిరంతర విద్యుత్ సరఫరా చేయడానికి తగు చర్య లు ప్రభుత్వం తీసుకుంటున్నది. అయితే క్షేత్రస్థాయిలో సిబ్బంది నిర్లక్ష్యం తో విద్యుత్ దుర్వినియోగం అవుతోంది. ఆన్ ఆఫ్ వ్యవస్థ సరిగా లేకపోవడంతో వేలాది రూపాయలు వృథా అవుతున్నాయి. మరోవైపు గ్రామపంచాయితీలపై వేల రూపాయలు అదనపు భారం పడుతోంది. మండల కేంద్రంతో పాటు మండలంలో వివిధ గ్రా మాల్లో కూడ ఇదే పరిస్థితి నెలకొంది. దీంతో పల్లెల్లో కూడా పట్టపగలు వీధి దీపాలువెలుగుతున్న వాటిని పట్టించుకునేవారు కరువయ్యారు.

పట్టపగలు వీధి దీపాలు వెలుగకుండా చూడాలి

గ్రామాల్లో పట్టపగలు వాధి దీపాలు వెలుగుతున్నాయి. వాటిని పట్టించుకొనే వారు కరువయ్యారు.. పట్టపగలు వీధి దీపాలు వెలగకుండా ఆన్ ఆఫ్ స్విచ్‌లను ఏర్పాటు చేసి పగటి పూట వెలగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలి.

- బొడ్డుపల్లి శంకర్, కొండమల్లేపల్లి



పాలపాటితండాలో దగ్ధమైన టేకు చెట్లు

32 టేకు చెట్లు దగ్ధం

పెద్దఅడిశర్లపల్లి, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని చిలకమర్రి శివారులోని పాలపాటితండాలో వ్యవసాయ పొలంలో శనివారం టేకు చెట్లు దగ్ధమయ్యాయి.. బాధిత రైతు మెగావత్ రామచంద్రనాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. తన పొలంలో 15 ఏళ్ల నుంచి 32 టేకు చెట్లు ఉండగా శుక్రవారం ఓ వ్యక్తి గుట్టుచప్పుడు కాకుండా నిప్పు అంటించినట్లుగా ఆరోపిస్తున్నాడు. ఆ వ్యక్తిపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. 15 ఏళ్ల పెంచుకుంటూ వస్తున్న టేక్ చెట్లు అగ్నికి ఆహుతి కావడంతో తీవ్ర మనస్తాపానికి గురైయ్యాడు. దాదాపు ఒక్కో చెట్లు రూ.30 నుంచి 50 వేల వరకు ఉంటుందని దాదాపు 12 లక్షల వరకు నష్టం వాటిల్లిందని బాధిత రైతు తెలపాడు. అనుమానితుని పట్టుకుని చట్టపరంగా శిక్షించాలని కోరారు.

ఉపాధి హామీలో అక్రమాలకు పాల్పడితే చర్యలు

● అడిషనల్ పీడీ నవీన్‌కుమార్ ● పీఏపల్లిలో సామాజిక తనిఖీ



సామాజిక తనిఖీలో పాల్గొన్న అధికారుల బృందం

పెద్దఅడిశర్లపల్లి, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): ఉపాధిహామీ పథకం పనుల్లో అవకతవకలకు పాల్పడితే చర్యలు తప్పవని జిల్లా అడిషనల్ పీడీ నవీన్ కుమార్ హెచ్చరించారు స్థానిక ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో శనివారం ఉపాధిహామీ సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. ఉమ్మడి మండలంలోని 31 గ్రామ పంచాయతీలోని గ్రామాల్లో ఏప్రిల్ 01, 2024 నుంచి 2025 మార్చి31, వరకు ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టిన రూ.8.20 కోట్లకు సంబంధించి పనులపై ప్రజావేదికలో సామాజిక తనిఖీ బృందం చేపట్టిన తనిఖీలో వెల్లడైన అవకతవకలను తనిఖీ బృందం చదివి వినిపించింది. అధికారులు అవకతవకలలో దుర్వినియోగమైన సొమ్ము రూ.3,50 లక్షలు రికవరీకి ఆదేశించారు. అంతేకాకుండా కొలతలతో తేడా చూపినందుకు రూ.7 వేలు జరిమానా విధించారు. ప్రజావేదికకు హాజరైన ఏపీడీ నవీన్ కుమార్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత ప్రజలు ఉపాధి కొరకు వలసలు వెళ్లకుండా ఉండేందుకు చేపట్టిన గొప్ప పథకం గ్రామీణ ఉపాధి హామీ పథకమని, ఎవరు అక్రమాలకు పాల్పడాలని చూసిన చట్టరీత్యా కేసులు, చర్యలు తప్పవన్నారు. క్షేత్రస్థాయి సిబ్బంది పని కోరిన ప్రతి ఒక్కరికీ 15 రోజుల్లో పని కల్పించాలని, పని ప్రదేశాల్లో నీడ, తాగు నీటి సౌకర్యం కల్పించాలని సూచించారు. అంబుడ్స్ పర్సన్ మహ్మద్ గౌరి, ఎస్ఆర్‌పీ బద్యనాయక్, సుశీల, డీవీవో శర్మ, ఏపీడీ యామిని, ఎంపీడీవో చంద్రమౌళి, ఎంపీవో కొండల్‌రెడ్డి, ఏపీఓ శ్రీనివాస్, టెక్నికల్ అసిస్టెంట్లు,ఫీల్డ్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

మహంకాళి ఆలయంలో బోరు ఏర్పాటు

చింతపల్లి, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లోని మాదన్నపేటకు చెందిన కర్నాటి ఆనంద్ గౌడ్, సరిత శనివారం మండలంలోని కుర్మేడ్‌గేట్(విరాట్‌నగర్ సమీపంలోని మహంకాళి ఆలయంలో బోరు ఏర్పాటు చేశారు. ఆనంద్ గౌడ్ ప్రతి శనివారం కుటుంబ సభ్యులతో కలిసి హైదరాబాద్ నుంచి దేవరకొండకు వెళ్తున్నారు. విరాట్‌నగర్‌లోని ఆలయానికి వచ్చే భక్తుల కోసం తాగునీటి సౌకర్యం లేదు. దీంతో సొంత డబ్బులు రూ. లక్షతో తాగునీటి కోసం బోరు ఏర్పాటు చేసి మోటర్ బిగించారు. భక్తుల కోసం...బాటసరుల దాహార్తి తీర్చడం కోసం స్వచ్ఛ ందగా బోరు మోటర్ ఏర్పాటు చేయడం స్థానికులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.



ఆలయంలో మోటర్ ప్రారంభిస్తున్న ఆనంద్, సరిత దంపతులు